
శుభమస్తు ఓం అవిఘ్నమస్తు

# శ్రీరాఘవేంద్రస్వామి చరిత్ర



రచన :
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.



## ప్రార్థన

కం॥ శ్రీ రాఘవేంద్ర చరితను
ఆ రాముడె ప్రోద్బలించి అందించమనన్
మీరిన భక్తితొ జెప్పెద
నే, రమ్మని పద్య కవిత నిపుణత నిపుడే.

ఆ॥ వినుడు, భక్తి యొకటె విలువైన అర్హత
రాఘవేంద్రుదయను లాఘవముగ
గొనుచు స్వామి పొగడి, కూర్మిని పొందగ
విద్యయేమి కొలత విబుధులార!

ఉ॥ శైవుడు వైదికుండునయి శంకరుగొల్చితి బూది వ్రాసితిన్
భావన జేత వైష్ణవుడ బందుగు శ్రీహరెనంచు నమ్మెదన్
లావుగ సాయిగాథలను రంజిల పాటలు పెక్కు పాడితిన్
ఈ విధి రాఘవేంద్రు కథ ఈశ్వరు సత్కృప నేడు జెప్పెదన్



కం॥ జుట్టును బట్టుచు నీడ్చిన
గట్టిగనే చూరుబట్టి గడుసరివోలెన్
పట్టుగ వేలాడెదరా
తిట్టిన సిగ్గేమినాకు తిరుమలనాథా!

మ॥ మనసున్ వంచుట చేతకాని నరుడన్, మన్నించి సద్బోధచే
ఘనవైకుంఠపు ద్వారమార్గమరయన్ గావించునా సద్గురుం
డని మున్ జెప్పిరి పెద్దలంత వినవే! అన్యాయమైపోతినే!
తనువున్ వీడెడి మున్నె దారి తెలిసెన్, ధన్యున్ ప్రభూ! రాఘవా!

సీ॥ ఏ వ్రతంబులు చేసె ఇటురార ముద్దీయ
తండ్రీ అనన్ తొల్లి దశరథుండు
ఏ నోము నోచెనో ఎలనాగ వైదేహి
నీ అనురాగంబు నెనరు బొందె



ఏపూజ చేసెనో హితవుగా మారుతి
కన్నీరు తుడువంగ కౌగలించి
ఏదానమిచ్చెనో ఇష్టుడైనడయాడె
ఆ విభీషణుడును అసురుడయ్యు

తే॥ గుహుడు ఏమిచ్చె పదమంటి కొలిచెనాడు
ఉడుత ఏమిచ్చె నీ ప్రేమ కడుగడించె
కాకి ఏమిచ్చె నువుగొట్ట కరుణవీడి
ఏమికాకుంటి మనిషినై ఇల జనించి.

చం॥ అనువుగ కన్నతల్లి మనలందరి గాచును శైశవంబునన్
తను, అతిశ్రద్ధ తండ్రిగొని ధన్యుల జేయును భక్తి బోధచే
గొనకొని సద్గురుండు కృపగూడగ జూపును జ్ఞానజ్యోతియున్
వినుడిది మోక్షదాత అరవింద దళాక్షుడు విష్ణుమూర్తియే

# శ్రీ రాఘవేంద్ర స్వామి చరిత్ర

"ఏకం సత్, బహుధావదంతి"

సత్యం ఒక్కటే. దాన్నే బహు విధముల వచింతురు. భగవంతుడే ఆది, అంత్యం. వృద్ధికి క్షీణించడానికి కారణం ఆయనే. ఆయనను తెలుసుకోవడానికి ప్రయత్నించే వారేకానీ పూర్తిగా తెలుసుకున్న వాడెవడూ లేడు.

అద్వైతం నీవే ఆయన అన్నది. అది కొన్ని విపరీతాలకు దారితీసి కుతర్కంతో పెడవ్యాఖ్యానాలతో మత ఛాందసులను నిజమైన అద్వైతులనుంచి దూరం చేసింది.

అప్పుడు జరిగిన పరిణామాలలో విశిష్టాద్వైతం ఉద్భవించింది. నీవే ఆయన కాని నీవు ఆయనలో కలిసే దాకా నీకు జన్మ రాహిత్యం కలిగే వరకు నీవు నీవే పరమాత్మ పరమాత్మే



అన్నది. భక్తి జ్ఞాన వైరాగ్య మార్గాలలో విశిష్టుడైతే జన్మబంధాల నుంచి బయటపడి అద్వైత సిద్ధి లభించి అప్పుడు జీవాత్మ పరమాత్మతో అనుసంధానమవుతుంది అదే మోక్షం అన్నది విశిష్టాద్వైతం. వీటిగురించి ఇంతకన్న చెప్పగలిగే శక్తిగాని, అర్హత గాని, జ్ఞానంగానీ లేని సామాన్యుడిని. అందుకని అసలు విషయానికి వస్తాను.

కొన్ని సంవత్సరాల క్రితం మంత్రాలయం సందర్శించి శ్రీ రాఘవేంద్ర స్వామివారి బృందావనం చూడగలిగిన భాగ్యం కలిగింది. భాగ్యనగరంలో శ్రీవారి ఆలయాలను దర్శించాను. వారి జీవిత చరిత్ర తెలుసుకున్నాను కానీ వివరంగా కాదు.

ఒకరోజున తెల్లవారు వేళ శ్రీ రాఘవేంద్రుని జీవిత చరిత్ర వ్రాసి ద్వైత సిద్ధాంత సువాసన నొకసారి తెలుసుకోవాలని పించింది. ఆ సంకల్పంలోంచి పుట్టిన ఈ నా ప్రయత్నం చదువరికి ఆనందం కలిగిస్తుందని నా ఆశ.



కాశీ నగరంలో శ్రీ విశ్వనాధుని ఆలయానికి నాలుగైదు బాటలున్నాయట. ఎటునుంచి పోయినా చివరి గమ్యం ఒకటే. అదే విశ్వనాధుని సన్నిధి. అట్లాగే ఈ ద్వైతమార్గంతో కూడా అద్వైత మార్గంతో పొందినట్లే ముక్తిపొందవచ్చు.

ఏ పూలతో పూజించినా, ఏది నైవేద్యమిచ్చినా ఏ విధంగా స్తోత్రించినా ఆ స్వామి కరుణ పొందుతారు. అదే విధంగా ఏ మతమైనా ఆ గోవిందునకు సమ్మతమే. గోవిందా అన్నప్పుడు నీ మనో నేత్రంలో ఆ స్వామి కనబడాలి. అంతే. ఇక చరిత్రకు సాక్ష్యం ఉంటుంది. కానీ ఇతిహాసానికి, పౌరాణిక సంఘటనకు సాక్ష్యం ఉండదు. కేవలం నమ్మకమే. హిరణ్యకశిపుడు ఈచోట తపస్సు చేశాడంటే ఎవరో మన పెద్దలకు వారి పెద్దలు..... అలా ఏనాటినుంచో వస్తున్న నమ్మకం. ఆ దైత్యుని అహోబిలంలోనే స్వామి చంపాడు అని నిరూపణ కావాలంటే ఒక్క నమస్కారం పెడతాం.

పురాతన చరిత్రలో నిజానిజాలు తెలియక చరిత్రకారులు తలబద్దలు కొట్టుకుంటున్నారు. తెనాలి రామకృష్ణుడికి, శ్రీకృష్ణ



దేవరాయలకీ ఎంతో కాల వ్యత్యాసం ఉందట. 500 ఏళ్ళ చరిత్రకే ఇట్లా అయితే పౌరాణిక సంఘటనలకేం నిరూపణ?

అంతెందుకు బ్రిటిషు వారు తాము భరత ఖండాన్ని తిరిగి ఒక్క రాజ్యంగా చేసి, విద్య (ఎ,బి,సి,డి లు) నేర్పి నాగరికతనేర్పి, ఉద్యోగాలిచ్చి, పారిశ్రామికాభివృద్ధి చేసి వాళ్ళరాజ్యం వాళ్ళు పాలించుకోగల శక్తి వచ్చిన తర్వాత మతకలహాలతో ఎవరికీ నష్టం జరుగకుండా భారత్ పాకిస్థాన్ సృష్టించి వాళ్ళకి ఒప్పగించాం అని వ్రాసుకుంటారు. భగత్‌సింగ్ అల్లూరి సీతారామరాజులను తిరుగుబాటుదార్లు అని వ్రాస్తారు.

అదే భారతీయుడు వ్రాసే చరిత్ర దీనికి విరుద్ధంగా ఉంటుంది. అందుకని రంధ్రాన్వేషణ మాని అతి క్లుప్తంగా రాఘవేంద్రస్వామి వారి పూర్వజన్మగాధ వివరిస్తాను.

శ్రీ మహావిష్ణువు (అసలు ఆయనున్నాడా అనుకునేవారు ఇది ఈ వాక్యంపైన చదవడం అనవసరం. వాళ్ళు సూర్యుడిలో హైడ్రోజన్ ఎన్నాళ్ళుంటుంది? ఇట్లాంటి సైన్సు నేర్చుకోండి) తన సేవకులలో ఒకడైన శంఖకర్ణుడనేవాడు బ్రహ్మకి విశ్వ

సృష్టికి సహాయకుడుగా నియోగించబడి, శ్రీహరిధ్యాసలో పరధ్యానంతో బ్రహ్మ మాట వినక శాపగ్రస్తుడై రాక్షస యోనిలో జన్మించవలసి వస్తుంది.

అతడే జగత్ ప్రసిద్ధుడైన బాలుడు, శ్రీహరి ఇందుగలడందు లేడన సందేహం వలదు. చక్రి సర్వోపగతుండు, యెందెందు వెదకి జూచిన అందందే గలడని తన తండ్రి హిరణ్యకశిపునకే చెప్పిన ప్రహ్లాదుడు. తండ్రి నరసింహస్వామిచే చంపబడ్డాక రాజైన ఆ దానవ శ్రేష్ఠుడు ప్రజా క్షేమం కోరి యజ్ఞ యాగాలు, ఆలయ నిర్మాణాలు, అన్నదానాలు చేశాడు.

ఆయన పరిపాలించింది నేటి తుంగభద్రానది తీరానయున్న అహోబిలం (కర్నూలు జిల్లా) ప్రాంతాన్ని. అట్లా ప్రజల కడగండ్లకి తనే కన్నీరు కార్చే ప్రహ్లాదుడు ఈ నేలపైన ఈ ప్రజలపైన మమకారం పోక యెన్నో జన్మలు యెత్తి ధర్మ బోధతో ఈ ప్రాంత ప్రజలని కాపాడుతూ వచ్చాడు. (సంభవామి యుగే యుగే అనేది శ్రీకృష్ణ పరమాత్మేకాక ఆయన భక్తులు కూడా చేశారు. ఆ యుగాలలో పుట్టిన మహానుభావులు తిరిగి



తిరిగి జన్మిస్తూ ఈ రోజుకీ ధర్మస్థాపనకు ప్రయత్నిస్తున్నారు.

ఆ ప్రహ్లాద మహారాజు ఒకానొక జన్మలో ఈ తుంగభద్ర గాలి వీస్తున్న చోట, శ్రీకృష్ణదేవరాయల తండ్రి నృసింహరాయల వారి కాలంలో ద్వైతమత గురువైన శ్రీసుబ్రహ్మణ్య తీర్థులు ప్రియ శిష్యుడుగా పసిగుడ్డుగా చేరి పెంచబడి సన్యాసాశ్రమం 8 సంవత్సరాలకే పొంది శ్రీవ్యాస తీర్థులుగా అవతరించారు.

జన్మాంతర సంస్కారం వల్ల శ్రీవ్యాస తీర్థులు ద్వైతమత వ్యాప్తిలో శ్రీకృష్ణ దేవరాయల వారి సహకారంతో అజేయంగా నెరవేర్చారు. జాతకరీత్యా ప్రభువు పదవీచ్యుతి నొందవలసి యున్నప్పుడు తాను ఆయన ముందు నిలుచుండి, పరిపాలించి పెక్కు హనుమదాలయాలు నిర్మించి సమయం చూచి శ్రీకృష్ణ దేవరాయలకు క్షేమంగా రాజ్యాన్ని ఒప్పగించారు. ఎన్నో భాష్యాలు రచించారు. 8-3-1539లో భౌతికంగా దేహాన్ని త్యజించారు. వీరి సమాధిని నవబృందావనమంటారు. తుంగ భద్రా నదీతీరంలో హంపీ దగ్గర ఆనెగొంది సంస్థానం దగ్గర ఉన్నది.



మరుజన్మలో ఆ వ్యాసేంద్ర తీర్థులే శ్రీ రాఘవేంద్రులుగా అవతరించారు. మన పూర్వీకుల అదృష్టం. వారితో జీవించి, తిని, తిరిగి జ్ఞాన బోధ చేసి మహిమలు చూపి అలరించారు. ఎంతోమంది ముస్లిం నవాబులతో కూడా భగవత్ స్వరూపునిగా కీర్తించబడ్డారు. మంచి బోధించారు.

ఆ స్వామి పాద ధూళి తాకిన ఏ మహామహునితో ఏదో ఒక ఋణానుబంధం వల్లనే నాకు ఈ విధంగా ధన్యుడినయ్యే భాగ్యం ఆ స్వామి కలిగించారు. ఇదేదో గొప్ప రచన అనుకోక గొప్ప మహామహుని సేవకోసం చేసిన ప్రయత్నంగా ఆఘ్రాణించండి.

శ్రీ రాఘవేంద్రా! యెల్ల నీదయ....



**జననం :**

చోళ రాజ్యంలో, గౌతమ ఋషి వంశంలోని శ్రీ తిమ్మన్నభట్టు వారికి ధర్మపత్ని శ్రీమతి గోపికాంబలకు జన్మించిన రాఘవేంద్ర స్వామి ద్వైత మతోద్ధారకులు. ఆ వంశంలోని శ్రీకృష్ణాచార్యులవారు శ్రీ కృష్ణదేవరాయల వారికే వీణ నేర్పిన విద్వాంసులు.

కంII శ్రీకృష్ణ దేవరాయలు
ప్రకృతిచే యోధ అయ్యు పండితుడు మదిన్
ఆకృతి దాల్చు సరస్వతి
శ్రీకృష్ణాచార్యువద్ద శిష్యుండాయెన్

ఆ కృష్ణాచార్యులు రత్న కిరీటం ధరించేవారట. ఆయన కుమారుడు కనకాచారి గొప్ప నిష్ఠాగరిష్ఠుడు. ఆయన కుమారుడే శ్రీ తిమ్మణ్ణాచార్యులవారు. ఆయన వేదాధ్యయనమే జీవన పరమావధి అని భావించిన గొప్ప శ్రీ వేంకటేశ్వరారాధకులు.

గొప్ప వ్యాకరణ వేత్త మరియు వీణా విద్వాంసులు. వాదనలో గొప్ప మేటి అనిపించుకుని పగలే దివిటీని పట్టించుకున్న శ్రేష్ఠుడు. వీరి సతీమణి గోపికాంబ

**ఆ॥ వినయ సంపదలతొ విలసిల్లె ఆలేమ**
**తానరుంధతనగ తగును జుమ్మి**
**ధర్మ ఆచరణన తరుణికి సాటి లే**
**దంచు పేరు నొందె ఆమె తాను**

వీరి వివాహమైన కొన్నాళ్ళకి తళ్ళికోట యుద్ధం జరిగింది. శ్రీకృష్ణ దేవరాయల వారి వారసుడు అళియ రామరాజు ఆ యుద్ధంలో బహమనీ సుల్తానుల చేతిలో పరాజితుడైనాడు. విజయనగర చరిత్ర పరిసమాప్తి అయింది. కవులు, గాయకులు, కళాకారులు పండితులు అనాధలైపోయారు. తిమ్మణ్ణాచార్యులు కూడా వలసపోతూ, తిరుపతి వేంకటేశ్వరుని దర్శించి చోళరాజ్యంలో స్థిరపడ్డారు.



**కం॥ పుత్రిక బడసిన పిమ్మట**
**పుత్రుని ముదమార పొందె పుణ్యాత్ముండున్**
**పుత్రుడు గురురాజన బడె**
**పుత్రిక తాన్ వేంకటమ్మ పూనుచు పిలిచెన్**

తన బిడ్డల ముద్దు ముచ్చట్లు చూచుకుంటూ, ఉన్నంతలో సంతోషంగా ఆ దంపతులు కాలం వెళ్ళబుచ్చారు. ఇట్లా కొన్ని సంవత్సరాలు గడిచాక ఒకరోజు తెల్లవారుఝామున తిమ్మణ్ణాచార్యుల వారికి ఒక దివ్య స్వప్నం వచ్చింది.

**ఆ॥ చిరుత నవ్వులొలుకు శ్రీ వేంకటేశ్వరు**
**స్వప్నమందు జూచి సజలనయను**
**డైన తిమ్మణార్యుడనె నిట్లు ఓయప్ప!**
**ధన్యుడైతి జన్మ ధన్యమాయె**

స్వామిని వేనోళ్ళ పొగడి నిద్ర మేల్కొన్న ఆయన తన భార్య



వదనంలో వింత వెలుగును జూచి తన స్వప్నం తప్పక అద్భుత ఫలిత మిస్తుందని గ్రహించారు. ఆయన యోచన సిద్ధించిందా అన్నట్లు గోపమ్మ గర్భవతయింది.

**తే॥ గర్భమందున్న బిడ్డతొ కాంతి పెరిగె**
**ఎఱ్ఱమన్ను తినాలని ఇంతికోరె**
**నడుము నెరవది పెరిగెను కడుపు దేలె**
**ఎఱుపు రంగున్న చీరలనిష్టపడెను.**

గర్భంలోని శిశువుకు చేయవలసిన సంస్కారాలన్ని వేదోక్తంగా జరిపి తిమ్మణాచార్యులు మహాపండితుడైన పుత్రోదయం కోసం వేచియున్నారు. అది మన్మధనామ సంవత్సరము ఫాల్గుణ శుద్ధ సప్తమి గురువారము A.D.1598 న చంద్రుడు శుభలగ్నంలో సూర్యోదయ వేళ గోపమ్మ దివ్యకాంతితో మెరిసిపోతున్న మగబిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డ



**కం॥ మచ్చను వీడిన చంద్రుడు**
**ఇచ్చోటకు తానుకోరి ఇంతికి పాపై**
**వచ్చెను ఒడిలో వ్రాలగ**
**అచ్చెరువుగ బిడ్డడుండె ఆ తీరుననే.**

సశాస్త్రీయంగా ఆ బిడ్డను హోమజ్వాల కాంతుల్లో చూసి అమందానంతకందళిత హృదయారవిందుడైన తిమ్మణ్ణాచార్యులు ఆబిడ్డ శ్రీవేంకటేశ్వరుని ప్రసాదం అని భావించి, సభలో వేంకట నాధుడని నామకరణం చేయించారు. రాకాసుధాకరునిలా దిన దిన ప్రవర్ధమానుడవుతున్న ఆ వేంకటనాధుని కేరింతలూ శైశవ క్రీడలు నవ్వులు వర్ణించనలవి కాదు.

**సీ॥ నాలుగు కాళ్ళపై నడుచు ధర్మము నేను**
**అన్నట్లు జూపును అతడు పాకి**
**అంతరాత్ముండౌచు హరియుండునన్నట్లు**
**నమరించు నోటిలో నతని వ్రేలు**

**తప్పటడుగులేసి తలనేలకానించి**
**విష్ణువందన మేమొ బిలిచి చూపు**
**ముంగిట నాడుచు మూతికి మట్టంట**
**మట్టియే మనమట్లు మరల నవ్వు**

**తే॥ ఆరు నెలలకు ముట్టెను అన్నమతడు**
**హరికథలు జెప్ప ఒడిజేరు ఆటమాని**
**కాలమావిధి కరిగెను కనుల ముందు**
**పాపడటు మూడు ఏళ్ళున్న బాలుడయ్యె**

ఈ విధంగా దిన దిన ప్రవర్ధమానుడై పెరుగుతున్న వేంకటనాధునికి మూడవ వసంతం వచ్చింది. అక్షరాభ్యాసం జరిపి అక్షరాలు దిద్దించారు తిమ్మణ్ణగారు. అప్పుడొక వింత జరిగింది. ఓం అని తండ్రి దిద్దించి నాయనా ఈ ఒక్క అక్షరం నారాయణుని స్వరూపం అన్నారు. దానికి ఆ బాలుడు తండ్రీ అనంతుడు, గుణ రహితుడు, ఆది మధ్యాంత రహితుడూ అయిన శ్రీహరిని ఈ ఒక్క అక్షరంలో బంధింపగలరా. కేవలం ఒకే



ఒక ధ్వనిలో నారాయణుడున్నాడనుట తగునా? అన్నాడు. సంభ్రమాశ్చర్యానందాలలో మునిగిన తండ్రి నోట మాటరాలేదు. శ్రీనివాసుని స్వప్న సాక్షాత్కారం కాంతి వెదజల్లుతున్నదని గ్రహించాడాయన.

ఇదిలా ఉండగా ఎనిమిదేళ్ళ వెంకటమ్మ సంస్కృత కావ్యాలు చదువ గలిగిన ఏక సంతగ్రాహి అయింది. గురురాజా చార్యులు వేదాధ్యయనం జేసి మంచి వైణికుడుగా గుర్తింపు పొందాడు. అతనికి కేవలం ఏడు సంవత్సరాలు.

**తే॥ భువికి దిగివచ్చె వసుదేవు పుత్రులు తమ**
**ముద్దు చెల్లెలితో నట్లు ముచ్వురచట**
**చేరి మురిపించిరందరిన్, శీఘ్రగతిని**
**వేంకటమ్మకు విచ్చేసె పెండ్లి ఈడు.**

కాశ్యప గోత్ర సంభవుడు మధురానగర నివాసియైన లక్ష్మీ నృసింహాచార్యులకు వేంకటమ్మనిచ్చి శాస్త్రోక్తంగా వివాహం



జరిపించారు, తిమ్మణ్ణాచార్యులవారు. అప్పుడే గురురాజా చార్యునికి ఉపనయనం జరిగింది. అతను బయటకు పోయి విద్య నార్జించే అర్హత సంపాదించాడు. దురదృష్టవశాత్తు తిమ్మణ్ణాచార్యులు కాలం చేశారు. గురురాజుపై కుటుంబ భారం పడి చదువు కుంటుపడ్డది. బావగారి సహాయంతో కొద్దిగా నిలదొక్కుకున్నాడు. అతి కష్టంమీద తమ్ముడు వేంకటనాధునికి ఉపనయనం జరిపించాడు.

స్వశక్తితో సంస్కృతంలో అమరకోశం, ధాతువులను పూర్తిచేసి, రత్నమాలవంటి కావ్యాలకు అన్వయం చెప్పగలుగు తున్నాడు వేంకటనాధుడు.

స్తోమతలేని గురురాజు తమ్ముని చదివించలేక పోతున్నానని విచారపడ్డాడు. కాని వేంకటనాధుడు ఒక నిర్ణయం తీసుకుని బావగారు లక్ష్మీనృసింహాచార్యుల దగ్గరకు వెళ్ళి తనకు చదువు చెప్పమని అభ్యర్థించాడు. తన శిష్యులతో పాటు ఆయన వెంకటనాధుడికి కూడా యజుర్వేదం నేర్పాడు. రెండుమూడుసార్లు



చదివి తిరిగి వేదం ఒప్పగించగల అతనిని చూచి ఆశ్చర్యపోనివారు లేరు.

ఈలోగా గురురాజు వివాహం జరిగి అనుకూలవతియైన భార్యతో, తల్లి గోపమ్మతో ఒక విధమైన తృప్తితో స్థిరపడ్డాడు. జీవితంలో కాలం వేగంగా దొరలిపోతున్నది. ఇక్కడ మన వేంకటనాధుడు....

**ఆ॥ ఆటలందు జూపె నత్యంత శ్రేష్టత**
**చేపవోలె నీదు చిన్నవాడు**
**సుందరాంగుడాయె చూపు తిప్పుట కాక**
**ఆడపిల్ల తండ్రులంత జేరె.**

బావగారు వేంకటనాధునికి తనకున్న విద్యనంతా నేర్పి ఆశీర్వదించి గురురాజా చార్యుల వద్దకు పంపించి వేశారు. సహజంగా అన్నదమ్ముల అనుబంధాలు వివాహం తరువాత

పలుచబడతాయి. కాని అవ్యాజానురాగంతో తల్లిదండ్రులై ఆ అన్నా వదినలు వేంకటనాథుని మంచి చెడ్డలు చూశారు. తమ్ముడికి వివాహం చేయాలని అతని అభిప్రాయం అడిగారు.

**కం॥ నదులును సాగరమందున**
**కుదురుగ కలియుటను జూపి గొప్పగ నాకో**
**విదుడగు వేంకటనాథుడు**
**ముదముగ చిత్తరువుతో సుముఖతన్ దెలిపెన్**

ఎందుచేతనంటే అతను అప్పటికే ప్రజాపతి, సోమ, వైశ్వదేవ, ఆహవ, నీయా ఇష్టులను పూర్తిజేసినాడు. (దీక్షితులు అని ఫ్రీగా పేరువాడుకుంటున్న నేను మాతాతగారు పెదనాన్నగారు సంపాదించి ఇచ్చిన పుణ్యాన్ని పేరును వాడుకుంటున్నాను. అవి కులవ్యవస్థ ఇంకా కుళ్ళుకంపు కొట్టని రోజులు) సరస్వతి అనే కన్య అన్నివిధాల అతనికి తగినదని నిశ్చయించారు.



**చం॥ సొగసును జెప్పనేటికది చూపులె జెప్పెను భామసొంపులన్**
**సుగుణము పాడనేటికది సుందరి నవ్వడి జెప్పెతానె, ఆ**
**మొగమది చంద్రబింబమని మూఢునికైనను దోచులిప్తలో**
**అగణితశీలనౌననుటకడ్డొకటుండునె కంజాక్షినైనన్.**

కనుక పెళ్ళి చూపులలోనే వధూవరులు వీరని నిశ్చయం జరిగింది. ఉన్నంతలో వివాహం వైభవంగా జరిగి శోభనం వంటి విదిత కార్యక్రమాలు జరిగిన పిదప సరస్వతి వేంకటనాథులు దంపతులై ఇల్లు జేరారు. శృంగార మాధుర్యం నీటి బుడగలాంటిది. నీటి బుడగ పేలిపోవటం తధ్యం. కానీ ఎంతసేపటికి అనే విషయం ఎవ్వరూ చెప్పలేరు. వేంకటనాథుడు సరస్వతి కూడా ఆ సంగతి త్వరలోనే గ్రహించారు.



**తే॥ వేద అధ్యాపకుండెపుడిది యెరుంగ**
**వలయు, ధనకాంక్ష వీడని వృద్ధగురుని**
**నాల్క నిలువదు వాగ్దేవి, నాణ్యత చెడు,**
**చావుకర్మల బెరిగియు సంపదలను.**

అందుచేత వేదాధ్యాపకుడై కూడా వేంకటనాథుని కార్జనలేదు. హృదయమున్న విద్యార్థుల తల్లిదండ్రులిచ్చు వస్తువులతో సగము రోజులు పస్తులతోనే ఇల్లు గడుస్తున్నది. భగవంతునికి నైవేద్యం పెట్టలేని స్థితి వచ్చింది. ఒక పిల్లవాడు పుట్టాడు. సరస్వతి తమ పస్తున్నా పాపాయికి పాలులేవని తల్లడిల్లిపోయింది.

దరిద్రం మనిషిని అధోగతి మెట్లు దించుతూ పోతుంది. వేంకటనాథుడు పౌరోహిత్యానికి కూడ సిద్ధపడ్డాడు. ఆతనికి విద్యవుంది కాని ధనమున్నవారి దగ్గర వగలు జూపించి విద్య తెలిసిన వాడని చెప్పుకునే తెలివి తేటలు లేవు. అందులోనూ అతను అసమర్ధుడనిపించుకున్నాడు.



విధిలేక భార్య పుత్రులతో ఒక సంతర్పణ కెళ్ళాడు భోజనం కోసం. యజ్ఞం జరిగిందక్కడ. నటన రాని వేంకటనాథుడు ఒకమూల ఒదిగి కూర్చున్నాడు. బ్రాహ్మణులంతా తామే నిర్వాహకులమన్నట్లు హడావిడిగా తిరుగుతున్నారు. ఒకాయన తనే యజమానిననిపించేలా వేంకటనాథుని పెద్ద అరుపులతో మందలించాడు.

**ఆ॥ 'సాన' చేతబట్టి చక్కగా గంధమున్**
**అరగదీయలేవ అర్భకుడవె**
**బ్రాహ్మణుడవు ఇట్టి బాధ్యతారహితుడై**
**తిండికొచ్చినావ త్రేన్పనీవు**

అని దెప్పిపొడిచాడొకాయన. అట్లాగే గంధం అరగదీస్తూ అగ్ని సూక్తం గుర్తుకొచ్చి దాన్ని పఠిస్తూ గంధం తీశాడు వేంకటనాథుడు. గంధం తీయటం పూర్తయింది. మంత్రాక్షతలు కలిపి భోజనాల దగ్గర అందరికీ అందించారు కొంతమంది.

వేంకటనాధుడు తీసిన గంధాన్ని అందరూ ఒంటికి పట్టించారు. ఇంకేముంది దేహం అగ్నిలా మండిపోతూ గగ్గోలు పెట్టారు.

యజమాని వచ్చి కోపంగా గంధం తీసింది యెవ్వరో కనుక్కున్నాడు. వేంకటనాధుని పిలిపించాడు.

**ఆ॥ ఏమి జేసినావు ఎవ్వడవుర నీవు**
**మంటనీయగలదె మంచిగంధ**
**మెన్నడైనగాని ఇదియేమి 'ఖర్మ' రా**
**మాట బోయెనాకు చేటు వచ్చె.**

యజమాని మాట వింటూనే వేంకటనాధుడు తన తప్పు తెలుసుకున్నాడు. అగ్ని సూక్తం తరువాత అతను వరుణ సూక్తం చదువుట మరిచాడు. తనాహ్వానించిన అగ్నిమంటనీయక ఇంకేమిస్తాడు. యజమానికీ సంగతి జెప్పి క్షమాపణ అడిగి వరుణ సూక్తంతో బాధా నివారణ జేశాడు.



అతని ప్రతిభ గుర్తించిన యజమానితో సహా బ్రాహ్మణులందరూ అతని కాళ్ళపై బడ్డారు. యజ్ఞం పరిసమాప్తం చేయించి వేంకటనాధుని ఘనంగా సత్కరించాడు. ఈ విధంగా మధ్య మధ్య సంతోష తరంగాలు కన్పట్టినా సరసు వీడిన చేపలా సతమతమయ్యేవాడు. ఉన్నట్లుండి కుంభకోణం గుర్తుకు వచ్చింది. ఆ మధ్వపీఠం, గురుపుంగవులు సుధీంద్రులు, వారితో తన తండ్రి పరిచయం, చిన్నతనంలో తనతండ్రి వెంట వారిని చూచినప్పుడు ఆయన

**కం॥ మెరిసెను కన్నులు గురునకు**
**మురిసెను, తన చేయిబట్టి ముచ్చట గొలుపన్**
**విరివిగ మాటల బొగిడెను**
**అరయరె వీడున్నతుండు నందరి గురుడౌ.**



ఆ తరువాత తన విద్యా సముపార్జనానంతరం ఆయనను కలిసినప్పుడు ఆయన మధ్వమత వ్యాప్తికి తంజావూరు మొదలైన సంస్థానములందలి పండితులతో వాదించి మధ్వమత ప్రాశస్త్యం నిరూపించి రాజ సత్కారం పొందినప్పుడు, వీడ్కోలు తీసుకుంటున్నపుడు నాయనా ఇది నీ ఇల్లు మరిచిపోకు అన్నారు.

**ఆ॥ వారి వీరి కాళ్ళు బట్టుచు బ్రతుకుట**
**మాని, కుంభకోణ మధ్వ పీఠ**
**మందు ఆశ్రయంబు నందిన మేల్గాదె**
**పొట్ట గడుచు, దక్కు పుణ్యమదియు.**

ఈ విధంగా ఆలోచించి వేంకటనాధుడు పత్ని సరస్వతితోను పుత్రుడు లక్ష్మీ నారాయణునితోను కలిసి కుంభకోణం చేరాడు. తనవూరు 'పట్టణం' వదిలి పెట్టాడు. మధ్వపీఠంలో సుధీంద్రుల శరణుజొచ్చాడు.



కుంభకోణంలో ఆనాడు నెలకొన్న మధ్వ గురుపీఠం, పెక్కు సంస్థానాలలో విశేషాదరణ పొందింది. శ్రీసుదీంద్ర తీర్థులు వేంకటనాధుని తండ్రిగారి గురువులు. ఆయన వాదపటిమచే ఎంతోమంది పండితులను ఓడించి 13వ శతాబ్దంలో శ్రీమధ్వాచార్యులచే స్థాపించబడిన ద్వైతమతాన్ని సుస్థిరపరచారు. విజయనగర సామ్రాజ్యంలో వెల్లి విరిసిన ఈ మతం తురుష్కుల దండయాత్రలతో అది విచ్ఛిన్నమైనప్పుడు అల్లల్లాడి ఈ కధాకాలం నాటికి చోళరాజైన శ్రీరఘునాధ రాయలు వంటి చిన్నరాజుల అండలో ఊపిరి పీల్చుకుంది.

ఈ మతముల సిద్ధాంతం ద్వైత భావన. అద్వైతంలో 'అహం బ్రహ్మాస్మి' ని పెడర్థం తీసుకుని మతగురువులు తామే సర్వస్వం అని నిరంకుశులై వక్రమార్గం పట్టారు. (అందరూ కాదు అని నా ప్రార్థన. ఒకరిద్దరు దుర్మార్గులు అన్నంలో రాళ్ళలా ఉంటూనే వుంటారు కాని. ప్రతి ముద్దకీ రాయి వస్తే 'చెరగక' తప్పదు కదా) నేటి పరిస్థితి వేరు. గ్రంధ పఠనం చదువు

వచ్చిన ప్రతివానికీ సాధ్యమైంది. మంచి చెడ్డలు గ్రహించే అవకాశం చిక్కింది. కాని 700 ఏళ్ళ క్రిందట అద్వైతంతో గర్విష్ఠులై తామే పరమశివుడు అనుకుని కొందరు, విష్ణువు అనుకుని కొందరు భక్తిమార్గం వదలి పాదపూజలు చేయించుకుని గురువు అంటే తండ్రి అనే భావన వదలి, ఏలిక అనే భావం జీర్ణించు కున్నారు. ఎన్నో దురాగతాలు జరిగాయి. కులగజ్జి పాకిపోయింది. పరిపాలించేవాడు మనవాడయితే చాలని మతమార్పిడులు పరమత ద్వేషం ప్రబలిపోయాయి. ఇది అద్వైత భావనతో కొంతమంది దుర్మార్గులు వక్రభాష్యం చెప్పి పరమాత్మ మార్గం వదలటం వల్ల జరిగింది. వారు భక్తిమార్గం దూరం చేసుకున్నారు. రాజే దైవాంశ సంభూతుడని జెప్పి పబ్బం గడుపుకున్నారు. నా మనవి ఆలోచించండి. మోక్షం సిద్ధించినంత మాత్రాన ఏం లాభం. పరమాత్మలో సాయుజ్యం కలిగితే లాభం. ఎందుకంటే అప్పుడు ఆయనే నేను, నేనే ఆయన. అహం బ్రహ్మాస్మి. అంతదాకా ఆయన పరమాత్మ నేను ఆత్మను లేదా జీవాత్మను. మనం ఎం.డి. గారి ఆఫీస్ ఛాంబర్‌లో కూర్చోవటం మోక్షం. ఎం.డి. అయిపోవటం



సాయుజ్యం. ఎం.డి. గారిని చూడటానికి ఎంతోమంది ప్రయత్నిస్తే ఆయన ఎవరో అర్హుడికే దర్శనం (ఇంటర్వ్యూ) ఇస్తారు కదా. ముందు అది తెచ్చుకోండి. తర్వాత ఎం.డి అవవచ్చు అంటుంది ద్వైతం ఎవరైనా ఎం.డి. అవవచ్చు అది కూడా సత్యమే. కాని అంతదాకా ద్వైతమే. ఆయన ఎం.డి., ప్రభువు, పరమాత్మ మరి నేనో ప్యూను, నౌకరు, జీవాత్మను ఈ అద్భుత యోచనే ద్వైత సిద్ధాంతం.

ఆ పరమాత్మ ఎంతటివాడో ఎలాంటివాడో ఎన్నటివాడో ఎవ్వరివాడో ఎలా తెలుస్తుంది. సాధ్యం కాదు. ఎందుకంటే....

కం॥ చేయుట, చేయక నుండుట
చేయుట వేరొక్క రీతి శ్రీహరి తెరగుల్
ఆయనె పోషకుడీ భువి
ఆయన ఆజ్ఞానువర్తి, ఆపును నడుపున్



అంతటి సర్వవ్యాప్తుని, సర్వ నిలయుని, సర్వదమనుని, సర్వ రక్షకుని గురించి మనం ఎన్నో జన్మల తరువాత ఆలోచిస్తాం, ఇంకా ఎన్నో జన్మల తరువాత కోరుకుంటాం ఇంకా ఇంకా ఎన్నో జన్మల తరువాత చేరువవుతాం. మరి ఆయనలో ఐక్యం ఎప్పుడవుతామో ఆయనకే తెలియాలి. అంతదాక ఆయన ధ్యాసే ఉండాలి. ఆయనను చేరుకుని ఆయన ఆజ్ఞనే తిరిగి భూమిపై కొచ్చి ఆర్షధర్మ బోధతో ప్రజల్ని ఉద్ధరించి ఆయన ఆజ్ఞతో తిరిగి ఆయనను చేరుకోవాలి. ఈ విధంగా ఆయన దయకలిగితే ఎప్పుడో ఆయనలో ఐక్యం అయితే అప్పుడు 'అహం బ్రహ్మాస్మి'. అందాకా జన్మలు బంధాలు తప్పవు. ఏ జన్మ నిచ్చినా ఆయనే శరణాగతి అనాలి.

**కం॥ పరమాత్మ సర్వ శ్రేష్ఠుడు**
**అరయగ నేనతని బంటు, నదియె నిజంబౌ**
**ఇరువురము వేఱు వేఱని**
**ఎరుగంగా ద్వైతమిచ్చె ఈ సద్బోధన్**



ఈ ద్వైత మతస్థాపకుడు శ్రీమధ్వాచార్యులవారు. 13వ శతాబ్దంలో మన్మధాచార్యులు అనే నామంతో జన్మించి ఆది శంకరాచార్యులవారు, రామానుజాచార్యుల వలె జగత్ ప్రసిద్ధులై ద్వైతమతాన్ని స్థాపించి శ్రీమధ్వాచార్యులని ప్రసిద్ధి చెందారు. ఆయన వాయుదేవుని అవతారమని త్రేతాయుగంలో ఆంజనేయునిగా, ద్వాపరయుగంలో భీమసేనుని గాను అవతరించారని ప్రతీతి. ధర్మ స్థాపనకు ఆయన ద్వైత సిద్ధాంతాన్నెన్నుకున్నారు. భగవత్‌గీతకు భాష్యం వ్రాశారు. పెక్కు గ్రంధాలు వ్రాశారు. మధ్వమతం ఆ తరువాత పద్మనాభ, నరహరి, మాధవ, అక్షోభ్య, జయ మొదలైన ఉద్దండ తీర్థుల లాలనలో విరిసింది. నరహరి తీర్థులు గజపతిరాజుల నుంచి శ్రీమూల రాముని విగ్రహం సంపాదించి మధ్వ పీఠంలో స్థాపన జేసి నిత్య పూజలు జరిపారు.

ఆ తరువాతి కాలంలో కవీంద్ర తీర్థులు, వాజిష్ఠ తీర్థులు, విజయీంద్ర తీర్థుల వంటి గురు పుంగవుల ఖ్యాతితో పెరిగి,

మన వేంకటనాథుడు సతీపుత్ర సమేతుడై సుధీంద్ర తీర్థుల వారి నీడలో ఆశ్రయం సంపాదించిన కాలానికి సుధీంద్రుల తర్క పాండిత్య ప్రతిభతో కుంభకోణంలో ప్రసిద్ధ ద్వైతమత పీఠంగా విరాజిల్లింది.

ఒకరి తర్వాత ఒకరు సుశిక్షితులు సుధర్మ బోధకులు ఆ కుంభకోణంలో మధ్వ పీఠాన్ని సుస్థిరం చేశారు. (2000 ఎ.డి. వరకు వస్తున్న ఆ గురు పరంపర వివరాలు చివరి పేజిలో ఈయబడినవి). ఈ కథాకాలం నాటి గురుదేవులు శ్రీ సుధీంద్ర తీర్థులు. ఆయన ధార్మికుడు మానవ రూపంలో వున్న కరుణ. పండితోత్తముడు.

**ఉ॥ ఈ గురు శ్రేణిలో తను సుధీంద్రులు జేరిరి మధ్వ చింతనన్**
**బాగుగు వాదనా పటిమ వంచిరి అన్యుల జైత్రయాత్రలో**
**చేగొని కుంభకోణమున శిష్యుల బెంచిరి, వంతయున్ బడెన్**
**ఆ గుణకీర్తి యోచనిదె ఆ గురుపీఠపు భావి ఏమగున్**



ఆ సమయంలో గ్రీష్మతాపానికి తపిస్తున్న భూదేవిని చల్లార్చుటకు వచ్చే తొలకరి వానజల్లులా వచ్చాడు. కాబోయే రాఘవేంద్ర తీర్థులు, నాటి వేంకటనాథుడు, సతీసుత సమేతుడై ఆశ్రయం కోరి.

కుంభకోణంలో కుటుంబ పోషణ సుగమమై, సుధీంద్రులు ఆశీస్సులతో పెక్కు మధ్వ మత బోధనా గ్రంధములను వెనుకటి గురువులు రచించిన భాష్యములు చదివి విరబూసిన జ్ఞానామృతంతో వేంకటనాథుడు శిష్యులకు వేద విద్య నందించాడు. తను పురాతన గ్రంధముల నుండి సేకరించిన కొత్త కొత్త విషయాలను శిష్యులకు విపులీకరించాడు. ఎందుకంటే

**ఆ॥ తండ్రి మురిసిపోవు తన సుతు జేతిలో**
**తను పరాజితుండుయైన గాని**
**శిష్యుజేతవోడి శ్రేష్ఠుడౌ గురుడట్లె**
**సంతసించు వాని జయము కోరు.**



అందుకనే ఆ రోజుల్లో గురువును మించిన శిష్యులుద్భవించి జ్ఞానజ్యోతి నలు దిక్కులా ప్రజ్వరిల్లేట్లు చేశారు.

**కం॥ పుట్టుకతోటే నాతడు**
**పట్టును సాధించి నట్టి ప్రతిభాశాలై**
**పెట్టెను విద్యాభిక్షను**
**గట్టిగ తన జ్ఞానమున్ను ఘనముగ బెంచెన్**

ఈ విధంగా మత గ్రంధాలను చదువుతూ, బోధించుచు ప్రశాంతమైన జీవనము గడుపుచు భార్యా పుత్రులతో వేంకటనాథుడు సంతోషంగా రోజులు గడుపుచుండెను. వేదాంత చర్చలలో పాల్గొని అసాధారణ ప్రతిభ జూపుతున్న వేంకటనాథుని జూచి పీఠాధిపతులు సుధీంద్ర తీర్థుల ఆనందం అంబర సీమ తాకనారంభించింది. వారు వేంకటనాథుని వెంటబెట్టుకుని చోళదేశ రాజధానిని చేరారు. అక్కడ ఆ సద్బ్రాహ్మణుల నిలయములన్నీ వాణీదేవి ఆలయములే. పామరుడనువాడు లేడు. అచ్చట సుధీంద్రులకు ఘనస్వాగతము లభించినది.



రాజమన్నార్ గుడి అనుచోట అద్వైత మత ప్రచారకుడైన ఒక సన్యాసి వారికి తారసపడ్డాడు. ద్వైత, అద్వైత, సిద్ధాంతములు ఉత్తర దక్షిణ ధృవములు.

**కం॥ జీవుడె బ్రహ్మము తానని**
**ఆ విధమును తెలియకుండె అజ్ఞానముచే**
**ఈ విశ్వమంత మిధ్యని**
**కోవిదులద్వైతమందు గుర్తించిరయా.**

ద్వైతము తద్విరుద్ధంగా పరమాత్మ సర్వ స్వతంత్రుడు, ఈశ్వరుడు, అనాది, సర్వోత్తముడు. జీవుడు భృత్యుడు, జన్మకర్మ బంధితుడు అని బోధిస్తుంది. వ్యాకరణ ప్రజ్ఞాశాలియైన వేంకటనాథుడు వేద మంత్రముల గూఢార్థముల నెరింగించి, అద్వైతులను తన వాదనా పటిమతో అవాక్కులను జేసి అందరితో బాగు బాగనిపించుకొనినాడు. సుధీంద్రుల ఆనందమున కవధులు లేవు.

తే॥ ముగ్ధులై వారు శిష్యుని మోదమలర
"ఓ మహా భాష్య ఆచార్య ఉన్నతమగు
బిరుదు గొనుమయ్య నీకీర్తి పెరుగు గాక
ద్వైతమత మహాజ్యోతిక వెలుగు" ననిరి

శిష్యుని పేరు నలుదిక్కులా పాకినది. మధ్వ మత ప్రాశస్త్యం పెరిగింది. ఆనాటి పాలకులు విద్యాభిమానులు. వారు ద్వైత మతాభిమానులై, దానినాదరించారు.

ఆ యాత్రలో సుధీంద్రులు వేంకటనాథునితో బాటు తంజావూరు సంస్థానము సందర్శించిరి. యజ్ఞ నారాయణ దీక్షితులు గారు సుధీంద్రులను ఆహ్వానించారు. మహాభాష్యాచార్యుని పలకరించి మీ దర్శనం కాకతాళీయం అయినా ఆనందం అన్నారు. దానికి వేంకటనాథుడు, అయ్యా నారాక ఉద్దేశ్య పూర్వకమే. కాకతాళీయం గాదు.



**తే॥ కాకి తాటి చెట్టొకదాని పైకి జేర**
**పుటుకు మని తెగి ఒక పండు పుడమి రాలె**
**ఒక్క మూర్ఖుడు అది జూచి అక్కజమున**
**ఇట్లు తలచెను 'ఈకాకికెంత బలము!'**

కాకి పండు రాల్చగల బలశాలి కాదు. కానీ ఆ కాకి వ్రాలుట, పండు రాలుట ఒకేసారి జరిగాయి కాబట్టి అట్లా అనుకోవటం అజ్ఞానం. అలాగే మీ పదప్రయోగంలో అజ్ఞానం ప్రతిఫలిస్తోంది అన్నాడు. దీక్షితులుగారంగీకరించారు. వైష్ణవ సంప్రదాయమైన, బాహుమూలములలో (చంకలలో) లోహ శంఖ చక్ర ముద్రికలను కాల్చి ముద్రలు వేయుట వింత ఆచారము వేదవిహితము కాదని దీక్షితులుగారు వాదించిరి. ఆ వాదన తిరస్కరించి వేంకటనాథుడు ముక్తికి తప్త ముద్ర ధారణ అత్యవసరమని గురు విజయీంద్ర తీర్థుల రచన (చక్ర మీమాంస) నాధారముగా చూపించి దీక్షితులు గారిని మంత్ర



ముగ్ధులను గావించారు. మహా భాష్యాచార్యుడే ఈతడని అంగీకరించారు.

వేదాంత బోధలలోనేగాదు సాహిత్య సేవలో కూడా వేంకటనాథుడు అద్వితీయుడనిపించుకున్నాడు. తను నమ్మిన వైష్ణవ సిద్ధాంతమును ద్వైతమత ప్రబోధలతో పరిమళంలా వ్యాపింపజేసి పరిమళాచార్యులనిపించుకున్నారు. అద్వైతాన్ని నిగ్రహించి మూలకారణుడైన బ్రహ్మము విష్ణు రూపమని ఆది వృద్ధి, అంత్యము గలయేది అయినా పరమాత్మ ప్రేరితమే గాని పరమాత్మ ఎన్నటికీ కాజాలడన్నారు.

చం॥ మతమును పెంపు జేయుటకు మార్గము బోధన కావ్యసేవయున్
అతడది నమ్మి సత్కృతుల నద్భుత శైలిని జెప్పె వాక్సుధా
చతురత వాదనా పటిమ చక్కని భాషణలిచ్చె మెప్పులన్
మితమది లేకపొందె, గొనె మిక్కిలి శ్రేష్ఠులనన్ ప్రసిద్ధులై



వారి ప్రసిద్ధ రచనలు 'ప్రమేయ నవమాలిక', 'శ్రీసుమధ్వ విజయం' సంస్కృత భాషా కోవిదుల విరచితమని, ఆ శైలి అతి తేలికగా తెలియపరచును. తరువాత కాలంలో వారి ముని మనుమడు కూడ మధ్వ గురువు వారీంద్రులై 'గురు గుణస్తవన' లో రాఘవేంద్రులైన తనముత్తాతగారిని నుతించారు.

రాఘవేంద్రులైన తరువాత వేంకట నాథుడు రచించిన పెక్కు గ్రంథములు సాహితీ వాగ్దేవి మెడలో నవరత్న మణిమయ హారాలయినవి.

**కం॥ పెరుగును మతము సుబోధచె**
**అరయంగా శిష్య సంఘ ఆదరణములున్**
**గురుతరముగ పెంపొందును**
**ధరనిలిచెడిదాక నరుల ధన్యులజేయున్**

ఋగ్వేదమునకు భాష్యము వ్రాయవలెనని వేంకటనాధుని కోరిక. కాని సుధీంద్రుల కాంక్ష అతనిని ఆచార్య పీఠమున కూర్చుండ బెట్టుట. ఇంతలో ఇంకొక శిష్యుని అభ్యర్ధనకు లొంగి సన్యాసమిప్పించవలసి వచ్చెను. అతనే యాదవేంద్రుడు. అతను గురువాజ్ఞచే మధ్వమత ప్రచారము విస్తృతముగా చేయదొడంగెను. ఎల్లరును తదుపరి పీఠాధిపతి ఆయనేయని నమ్మిరి. వేంకటనాధుడు మాత్రము ఋగ్వేద మీమాంసలో తలమునకలై వున్నాడు.

**కం॥ ఒక రేయి మూలరాముడు**
**ముకుళిత హస్తుడు సుధేంద్రు ముందర కలలో**
**"ఇక నా వేంకటనాధుడె**
**సకలంబౌ మఠపు విధులు జరుపును" అనియెన్**

ఉలికిపడి లేచిన సుధీంద్రులు కలత జెందారు. మూలరాముని ఆదేశం ధిక్కరించలేడు. సన్యసించిన యాదవేంద్రుని కాదని,



జీవనం గడువక తన శరణుజొచ్చిన సరస్వతి గుండెలో మంటలు రేపాలి. ఒక పసికందుకు తండ్రిని దూరం చేయాలి. విద్యా బోధన తన ధ్యేయం అనే శరణాగతునికి సంసారం కాదని బలవంతపు సన్యాసమిప్పించాలి. మఠంలో రాబోయే తిరుగుబాటునెలా ఎదుర్కోవాలి?

కాని ఆయన గుండె రాయిచేసుకుని వేంకటనాధునికి సంగతి వివరించారు. దానికాతడు ఇలా అన్నాడు.

**తే॥ ఏను బిడ్డకు తండ్రిని, ఇంతి నొదలి**
**నేచరించను అని మున్ను నిండు సభకు**
**ప్రతిన జేసితి, నేడిట్లు పత్ని ఉసురు**
**పోసుకొన సేమకరమౌనె? యుర్వినఘ!**

(తథాస్తు దేవతలు అది విన్నారేమో గాని మరికొన్ని రోజులకి అదే జరిగింది. ఆమె తన ఉసురు తీసుకుంది. నిండు జీవితం వ్యర్ధం చేసుకుంది) తనకు తనవారికి భుక్తి నొసంగి జ్ఞాన వృద్ధికి తోడ్పడి పేరు ప్రతిష్ఠలను దెప్పించిన సుధీంద్రుని విన్నపమును



కాదనుటెట్లు? శాంతి పుంభావ రూపమైన ఆయన ఒకవేళ తనని శపించవచ్చును. అది మాత్రం తన సతీసుమతులకు ఏమి లాభం?

**ఆ॥ మ్లాన వదనుడైన మగని గాంచిన భార్య**
**ఏమి ఆయెనంచు సేమ మడిగె**
**మారు బలుకడాయె యెరుగడు కునుకైన**
**సమ్మతించె తాను సన్యసించ**

ఆ విధంగా ఆలోచించి వేంకటనాధుడు సుధీంద్రులకు తన అంగీకారం తెలిపి తన పుత్రునికి ఉపనయనం చేసి తండ్రిగా తన బాధ్యత తీర్చుకొనుటకు అనుమతి నడిగాడు. గురువు సంతోషంతో అంగీకరించారు. భార్యకా ఉపనయనం సంగతి నెరిగించగానే. సరస్వతి తనుకూడా....



**కం॥ తలచెను కారణమిదియని**
**పొలతియు తను సమ్మతించె పుత్రుని వటుగా**
**తిలకించనామె వీడెను**
**తలపులు, తనపతికి చేసె తగు సాయంబున్**

ఉపనయనం అయిన వెంటనే తన సంసిద్ధత నెరిగించాడు. అయితే సుధీంద్రుల సమస్యలు రెండు. సన్యాసమిప్పించుకున్న యాదవేంద్రుని కాదనుటెట్లు? సతి సమ్మతిని పొందని వేంకటనాధునికి సన్యాసమిచ్చుటెట్లు? ఆ కార్యక్రమము కుంభకోణంలో జరిగిన ప్రజలు మఠమును వ్యతిరేకించ వచ్చును. పెద్ద గొడవ కావచ్చును. ఆయన తంజావూరు పాలకుడు, రఘునాధ భూపాలుని ఆ కార్యక్రమము జరిపించవలసినదిగా అభ్యర్ధించాడు. దానికా రాజు ఔనన్నాడు. ఈ వార్త తెలిసి చాలమంది విద్యావేత్తలు పండితులు ఆ కార్యక్రమం తిలకించుటకు తంజావూరు చేరుకుంటున్నారు. అది క్రీ.శ. 1621 ఫాల్గుణ శుద్ధ ద్వితీయ. ఆ క్రితం రాత్రి

వేంకటనాధునికి కంటిమీద కునుకే లేదు. వేంకటనాధునిగా భార్య సనాధగా వదిలిన అనాధునికి నిష్కృతి లేదు. భగవదేచ్ఛను కాదను హక్కు తనకు లేదు.

ఉష : కాలపు వెలుగు రేఖలు, శుభ ఘడియ సమీపిస్తోందని తెలిపాయి.

**కం॥ వేంకటనాధుని గైకొని**
**సంకల్పము జేసినారు సన్యాసంబున్**
**లెంకకు నిప్పించంగా**
**జంకక తానా సుధీంద్ర సద్గురులంతన్**

తంజావూరు రాజప్రాసాదమున ఆ మహోత్సవం విద్వాన్మణుల సమక్షంలో రాజుగారి ఆధ్వర్యంలో సుధీంద్రుల పర్యవేక్షణలో జరిగింది. తన ప్రియ శిష్యునికి తురీయాశ్రమము నిచ్చి ఆయన రాఘవేంద్ర తీర్థులని నామకరణము జేసి దీక్షనిచ్చారు. గురు సుధీంద్రులు, మఠం పీఠాధిపతి పట్టం కట్టారు. శంఖమునుండి పవిత్ర జలంతో స్నాతుని జేశారు.



ఇకపై ఆ వేంకటనాధుడు శ్రీహరికి తప్ప ఎవరికీ నమస్కరించడు. ఆశీర్వదిస్తాడు. కాని ఎవరి ఆశీస్సులు పొందడు. సతీసుతులు, తోబుట్లతో సంబంధం లేదు. మణిహారాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలు, స్థిరచరాస్థులు మాటే లేదు. శరీర పోషణకు మాత్రమే తిండి, మఠం పెంపుకు మాత్రమే శిష్యులు. కడసారి తనయెదుట వినమ్రుడై నిలుచున్న ప్రియ శిష్యునికి తన స్వప్న సాకారానికి సర్వం త్యజించిన ఆ దైవ స్వరూపుని గురు సుధీంద్రులు ఈ విధంగా ఆశీర్వదించారు. నాయనా!....

**సీ॥ వేదాంత సామ్రాజ్య పీఠంబునెక్కిన**
**వేంకటనాధుడా! విష్ణునిచ్ఛ**
**రాఘవేంద్రుడన నీరాజనంబుల నొంది**
**శ్రీహరి సంకల్ప సిద్ధియగుత!**
**'ధనదుని' మించిన ధన సంపదలు గల్గి**
**శ్రీరాము మంచియు కరణ గల్గు**



**గురు 'సురేంద్రు'ల భక్తి కూడును మీకింక**
**యతి 'విజయేంద్రు'ల యశము గల్గు**
**పీఠాధిపతివౌచు మఠ మన్ననలు బెంచు,**
**వాదంపు కుశలత వరలు గాక!**

**ఆవె ॥ అంతులేక పెరుగు ఆచంద్రతారార్క**
**మంత మీదు కీర్తి అలరు గాక!**
**మూలరామచంద్రమూర్తి అత్యుత్తమ**
**దీవెనలను 'వృష్టి' దేల్చుగాక!**

నేటినుండి శ్రీరాఘవేంద్ర తీర్థులు మధ్వ పీఠాధిపతిగ యశశ్చంద్రికల నిలుతురు గాక. శ్రీ సుధీంద్రులు మఠ బాధ్యతలన్నీ క్రమముగా రాఘవేంద్రులకు ఒప్పగించారు. సంస్థానపు మూల విగ్రహములైన మూలరామచంద్రుని విగ్రహము దిగ్విజయ రాముని విగ్రహము, జయజయరాముని విగ్రహము, శ్రీమధ్వాచార్యుల వారికి వేదవ్యాసుడు సాక్షాత్కరించి



ఒసగిన సైకత విగ్రహములు రెండింటిని వేదాంత గ్రంథంబులను, శ్వేత ఛత్రమును, వింజామరలు, స్వర్ణ పల్లకి, మున్నగునవి శ్రీరాఘవేంద్ర తీర్థుల అధీనము గావించబడినవి.

**కం॥ తదనంతరము సుధీంద్రులు**
**ముదముగ ద్వైతంపు వ్యాప్తమునకై బ్రతుకున్**
**కుదిరించి, రెండు ఏళ్ళకు**
**తదుపరి బృందావనమున తనువును వీడెన్.**

ఈ విధంగా క్రీ.శ. 1623లో రాఘవేంద్రులు తమ గురువును కోల్పోయారు.

ఇదివరలో చెప్పినట్లు కుంభకోణంలో భర్త రాకకు వేయి కళ్ళతో ఎదురు చూచిన సరస్వతి చెవులకు ప్రజల గుసగుసలు అస్పష్టంగా వినిపించాయి. తన భర్త సన్యసించెనట. తన గతేమిటి? ఏది నిజం ఏది అబద్ధం?

**ఉ॥ నీతికి మారుపేరితడు నీమము వీడడు ధర్మమూర్తి ఏ**
**నాతిని ధర్మపత్నియని నమ్మెనొ యామెకు తోడు నీడయౌ**
**చేతల జూపు చెప్పునది శ్రీహరి గొల్చును వేద బోధకుం**
**డాతడె ఇట్లు జేసెనని అందరు జెప్పిన నమ్మశక్యమే!**

ఈ విధంగా తలచి, రోదించి ఒక నిశ్చయానికి ఆమె వచ్చింది. తన పుత్రుని. వదిన బావగార్ల రక్షణ కొప్పగించి ఆమె ఒక పిచ్చిదానిలా నడుస్తూ తంజావూరు బయలు దేరింది. కాని మనో వేదన భరించలేక దారిలో ఒక పాడుబడ్డ బావిలోకి దుమికి ఆత్మహత్య జేసుకుంది. ఎన్నడూ అటువంటి నీచపు పని చేయరాదు. పరమాత్మ ఇచ్చిన జీవితాన్ని ఆయన ముగించాలి గాని, మధ్యలో ముగించటం ఆయన సర్వేశ్వరత్వాన్ని ధిక్కరించటమే కదా. అది తప్పు.



**తే॥ పొందెనా భామ ఆ విధి ఉసురు బాసి**
**ఒక్క పైశాచి రూపమున్ యుర్వి వీడి**
**స్వర్గధామమ్ము జేరుట జరుగదాయె**
**రాఘవేంద్రుడు ఇది జూచి అఘము బాపె**

స్వామి శ్రీహరిని ప్రార్థించి ఆమె ఆత్మకు పుణ్యగతి నిమ్మని కోరి ఆ రూపముపై మంత్రజలం సంప్రోక్షించగానే ఆమె ఆ రూపం వదలి స్వర్గం పొందింది.

ఇక యాదవేంద్రుడు కూడ జరిగిన దాంట్లో స్వామి తప్పేమి లేదని, అది శ్రీహరి సంకల్పం అని గ్రహించి మునుపటి వలెనే మధ్వమత ప్రాశస్త్యమును ప్రచారము చేయు కార్యక్రమమును చేపట్టెను. ఆయన చివరకు కృష్ణానదీ తీరమున 'మూడుమాలె' అనే చోట బృందావనస్థులైనారు. ఇక రాఘవేంద్రులు అవతరించారు. సంభవామి యుగే యుగే...



అనే కదా పరమాత్మ వాగ్దానం. రాఘవేంద్రుడంటే పాపవిముక్తులని గావించి శిష్ట కామనలు తీర్చేవాడని అర్థం. ఈ అవతారమూర్తి చేయబోయే కార్యక్రమములు తెలిసే కాబోలు, సుధీంద్రులకి స్వప్నమున మూలరాముని ఆదేశం కూడా అలాగే జరిగింది. శ్రీరాఘవేంద్రునికి అత్యంత ప్రియ శిష్యుడైన అప్పణాచార్యులు 'ఓం శ్రీరాఘవేంద్రాయనమః' కంటె మేలైన అష్టాక్షరీ మంత్రం లేదని చాటారు. సిద్దీమసూద్ ఖాన్ వంటి అన్యమతస్థులు దైవంగా భావించారు. కేవలం ఆయన జీవన కాలంలోనే కాదు, సిద్ధిపొందిన తరువాత (బృందావన వాసులయ్యాక) కూడా ఆయన మహిమ భక్తులను, ఇంగ్లీషు దొరలకు (సర్థామస్ మన్రో) కూడా అవగతమయింది, అవుతున్నది ఇకముందు అవుతుంది. ఆయన రచనలు సనాతన ధర్మ ప్రబోధనా కరదీపికలు. ఆయనకు చదువులపైగల జిజ్ఞాస అనంత ధారావాహికలా సాగింది. పరిమళాచార్యులని గురువులు, శ్రీరాయలవారని భక్తులు, రాఘవేంద్రా! అని ఆర్తులు ఆయనను పిలిచేవారు.



**ఆ॥ పూర్వజన్మయందు ఉదయించె నీతడే**
**వ్యాసరాయు డనుచు వాసికెక్కె**
**పాండితీ గరిమయు వదలక వెంటాడె**
**రాఘవేంద్రుడన్ని లబ్ధిపొందె**

నిరంతర భగవధ్యానం తపోదీక్షా బ్రహ్మచర్యం ఆత్మావలోకనం ఎవ్వరికైనా అణిమాది సిద్ధులు దైవత్వం చేకూరుస్తాయి. ఇక అవతార పురుషుల సంగతి వేరే చెప్పవలెనా!

ఇక శ్రీరాఘవేంద్రయతి దినచర్య నొక్కమారు చూడండి.

**సీ॥ మేలు కొల్పులు పాడకలిసి భక్త జనాళి**
**ఆ 'శయనోద్ధాన' మపుడు జరుగు**
**దైవప్రార్థన యైన దీవించి భక్తులన్,**
**కావేరి స్నానంబు గరపు గురులు.**

అష్టాక్షరీ, ద్వాదశాక్షరీ మంత్రాల
జపియించి మృత్తికా స్నానమగును
పరమాత్మకును వేల్పు వరులకందరికిని
అర్ఘ్యంబులిత్తురు అనఘుడంత

తే॥ కట్టి కాషాయ వస్త్రాలు, ఘనపు గోపి
చందనంబుతో నామంబు చక్కదిద్ది
ప్రణవ మంత్రము జపియించి పరమగురులు
ఆహ్నికంబులు దీర్తురు అంతతాము

తదుపరి ఏదైన పురాణ శ్రవణ కార్యక్రమములో పాల్గొంటారు. అనంతరం తన పరమగురువులు (తనగురువు సుధీంద్రునకే గురువులు) అయిన విజయేంద్ర తీర్థుల బృందావనం చూసి సాష్టాంగ నమస్కారం చేస్తారు. త్రోవలోనేగల కుంభేశ్వరునికి నమస్కరించి మఠం చేరుకుంటారు. ఇక వారు ఆచార్యులు. ఆయనను మించిన అధ్యాపకులు దొరకరు.



ఉ॥ చేరిన శిష్య మండలికి చేతురు బోధన బ్రహ్మ సూత్రముల్
తీరుగ 'మధ్వ' బోధనల దేల్తురు 'శ్రీజయతీర్థ' బోధనల్
వారిదె పూర్వ జన్మయగు 'వ్యాసయతీంద్రు'ల సూత్ర భాష్యముల్
మీరిన నైపుణిన్ గురులు మేటి విధంబున జెప్పునంతటన్

ఈ విధముగా అపరాహ్ణము వరకు స్వామి పాఠ ప్రవచనములు కొనసాగింతురు. పిమ్మట స్నానమాచరించి శుద్ధులై శ్రీమూలరామచంద్రుని, గరుడవాహన శ్రీలక్ష్మీ నారాయణుని, దిగ్విజయ రామచంద్రమూర్తి విగ్రహములతోపాటు తన స్వహస్తములతో చెక్కిన శ్రీకృష్ణ ప్రతిమను మంత్ర తంత్ర యుక్తముగా అర్చించెదరు.

కం॥ తదనంతరంబు విష్ణుని
పదముల స్పర్శించి దివ్య పాదోదకమున్
ముదముగ 'భిక్ష' ప్రసాదము
అదె యని గైకొందురంత ఆ గురుదేవుల్



రాఘవేంద్రులకు విరామమను నదియే లేదు. ఆయన నేటివారి వలె 'నడుము వాల్చుట' నెరుంగరు. భిక్ష స్వీకరించిన వెంటనే శిష్యులకు వ్యాకరణం, తర్క శాస్త్రము బోధింతురు. పండితులతో గోష్ఠి జరిపి వేదాంత విషయములు చర్చించెదరు. తుట్టతుదకు 'సర్వ శ్రీకృష్ణార్పణమస్తు' అని ముగింతురు. వారు అద్వైత సిద్ధాంతమును విభేదించి వాదించునప్పుడు అద్వైత గురువులు కూడా ఔరా ఎంత గొప్ప తర్క పండితుడు అనుకునేవారట. మధ్వమే పరమాత్మకు దగ్గర దారి అనుకునేవారట.

ఇక సాయంసమయమవుతుంది. మరల స్నాన మాచరించి శుచియై శ్రీమూలరాముని అర్చించి, పాలు పండ్లు నైవేద్యమిచ్చి బంగారు పళ్ళెరములో హారతిచ్చెదరు. ఒక్కొక్కప్పుడు ధ్యాన సమాధిలోనికి వెళ్ళిపోయేవారు. తన మూలరాముని, ఆయన వాగ్గేయకారులై అద్భుతమైన 'కన్నడ' కీర్తనలు పాడి ఆరాధించేవారు. అటువంటి ఒక కీర్తన......



"ఇందు ఎనగె గోవింద! నిన్నయ పాదారవిందవ తోరో ముకుందనె"

పరిశీలిస్తే ఆ కీర్తన అర్థం ఈ పద్యంలో ఇలా ఉంటుంది.

ఆ॥ హే ముకుంద! నీదు ఇంపైన పదపద్మ
దర్శనంబు నిమ్ము దయను జూపి
వేరు దారిలేదు నా రక్ష భారమ్ము
అంత నీదె తండ్రి! అర్భకుడను.

తన అద్భుత వీణా నాదముతో తన గొంతు మిళితం జేసి "భైరవి" రాగంలో శ్రీ రాఘవేంద్రులు పాడుతున్న దృశ్యం కళ్ళముందు తెచ్చుకోండి అదే క్షణంలో వారి పరమహంస మీ బాధ్యత తీసుకుంటుంది. ఇలా ప్రార్థించండి.

**ఆ॥ రాఘవేంద్ర నీవె రక్షవు నాబోటి**
**వారి దిక్కు నీవె పరమగురుడు**
**నీవె, జూపవయ్య నేనెరుగను శాస్త్ర**
**జ్ఞానమసలు లేదు శ్రద్ధయైన**

రాఘవేంద్ర! ఎల్ల నీదయ.....

కాలచక్రం దొర్లుతూనే వుంది. అది ఎవరికోసం ఆగదు కదా. ఈలోగా చోళ రాజ్యంలో రాజకీయ సంక్షోభం తల ఎత్తింది. చిన్న చిన్న మండలాధీనులు కొట్లాడుకోసాగారు. నేనూ వున్నానని దరిద్ర దేవత తాండవమాడింది. కరువు వచ్చింది. చోళ రాజు రాఘవేంద్రుని శరణు వేడాడు. దానికి స్వామి ఇలా అన్నారు.

**కం॥ వచ్చెద తంజావూరున**
**మెచ్చుగ కొన్నాళ్ళపాటు మీబాగునకై**
**హెచ్చిన ప్రీతితొ నిలిచెద**
**ఇచ్చకములు దీరు మీకు ఇకనో రాజా!**



ఆ విధంగా తంజావూరు చేరిన స్వామి 12 సంవత్సరములు తంజావూరు ప్రజలను కాపాడి క్షామము తొలగించినారు. స్వామి సెలవడిగారు. కుక్కతోక వంకరన్నట్లు రాజులకి ఆగ్రహం అనుగ్రహం రెండూ క్షణికమే. రాఘవేంద్రునకు చోళరాజు రత్నభూషిత కంఠాభరణమును సమర్పించుకొని తన కృతజ్ఞత చాటుకున్నాడు.

**తే॥ నవ్వి, వైరాగ్యమొప్పిన నయనములతొ**
**రత్నహారంబు వేసిరి రగులుచున్న**
**యజ్ఞగుండంబునందున, అంత పనికి**
**క్రుద్ధుడాయెను ఆరాజు 'కుతకుత' మని**

ఎంత అహంభావము? రాజు విష్ణు అంశజుడు అంటారే అట్టి నేను స్వయంగా బహుకరిస్తే తిరస్కరిస్తాడా అనుకుని జుగుప్సతో మ్లానమయిన వదనంతో ముభావంగా ఉండిపోయాడు రాజు.



క్షణంలో దానిని గ్రహించిన యతిరాజు అంతర్గతుడైన పరశురాముని ఆహ్వానించి ప్రార్థించి నీటితొట్టెలో చేయిపెట్టినట్లు యజ్ఞ కుండంలో చేయిబెట్టి హారాన్ని వెలికి తీసి రాజుకిచ్చారు.

**కం॥ దైవం బితడని యెరిగెను**
**ఆ వెన్నను క్షమను వేడె అశ్రువులొలుకన్**
**దీవించి, తాను వచ్చిన**
**తావునకే యోగిరాజు తరలిరియంతన్**

ఈ విధంగా కామ, క్రోధ, లోభ, మోహాది అరిషడ్వర్గాలను జయించిన రాఘవేంద్రులు కుంభకోణం మరల చేరారు. అద్వైత సిద్ధాంతాన్ని సిద్ధాంత పరంగా విభేదించే వారే గాని, అద్వైతులపై స్వామికి ఏ ద్వేషమూ లేదు. కర్మ బంధాలుగల జీవాత్మ పరమాత్మ యెన్నటికి కానేరదని ఆయన వాదన. ఆ వాదనా పటిమ అద్వైతులనే విస్మయ పరచేది. చర్చతదనంతరం,



**ఆ ॥ శాలువలను గప్పి చక్కగా మన్నించి**
**సాగనంపు వారు స్వామియంత**
**మతము శ్రేష్టమేదొ చతురతన్ బోధించు**
**నిందజేయ రెపుడు నిపుణులెందు**

యతికి స్థిరనివాసము రాగ బంధము నిషిద్ధము గాన వారు సదా సంచారులై ప్రజలకు భగవన్మార్గము బోధించుచూ మంచి చెడ్డలు చెప్పుచుండవలెను.

రాఘవేంద్రులు కూడ అట్లే నిశ్చయించి ముందుగా తూర్పు దిశ పర్యటననెన్నుకొనిరి. కమలాలయము, అర్ధనారీశ్వరము కావేరి సాగరసంగమం దర్శించారు.

**ఆ॥ అచటనుండి చేరిరా మౌని రామేశ్వ**
**రంబు, గాంచినారు రామసేతు**
**బంధనమ్ము, దర్భ పాన్పును దర్శించి**
**స్నానమాడినారు స్వామియచట**

శ్రీరామచంద్రమూర్తి సేతువు నిర్మించి జలధి దాటి రావణ సంహారం చేసిన భారతావని పాదపు చిటికిన వేలు అది. అచటనుండి అనంతశయన స్వామిని (తిరువనంతపురం) దర్శించారు. తదుపరి తామ్రపర్ణీ నదీతీరం చేరారు. అచట సంఘం నుండి వెలివేయబడి బాధ పడుతున్న ఒక బడుగు బ్రాహ్మణుని జూచి తన శంఖోదకము వానిపై చిలకరించి

**ఆ॥ సాటి వాడనంచు జాలి సుంతయు లేక**
**బాధపెట్టుటిట్లు పాడికాదు**
**తప్పు జేయకుండ ధరనుండు నెవ్వండు?**
**క్షమయె లేని వారి జన్మయేల?**

అని మందలించి ఆ బ్రాహ్మణులు వానిని తమలో కలుపుకునేట్లు చేశారు. అచటనుండి మధురాపురి చేరారు. క్రీ.శ. 1623-1659 కాలంలో తిరుమల నాయకుడు మధుర పాలకుడు. శ్రీ రాఘవేంద్రుల పరమ గురువులు (గురువుగారి గురువు) శ్రీ విజయీంద్ర తీర్థుల సమకాలికుడైన అప్పయ్య దీక్షితులుగారి మనుమడు నీలకంఠ దీక్షితులు తిరుమల



నాయకుని విద్యా మంత్రి ఈయన అగ్రశ్రేణి అద్వైతి. మధ్వ సిద్ధాంతం, ద్వైత భావన దీక్షితులుగారి మనసుకు నచ్చనివి.

అద్వైతులందరూ విశిష్టమని భావించే భాట్ట మీమాంసను వారు క్షుణ్ణముగా పఠింతురు. మధ్వుడయిన రాఘవేంద్రుని ఆ మీమాంస గురించి ప్రశ్నించారు దీక్షితులు. స్వామికి ఈ మీమాంసలు ఒక లెక్కా

**కం॥ మీనంబు నొక్కదానిని**
**మానవుడొక చెఱువు నుండి మార్చిడి చేయన్**
**ఏనాడు ప్రాణ మొదలదు**
**ఆ నూత్న తటాకమందు అదెవిధి మెలగున్**

అట్లాగే స్వామికి కొత్త విషయం అనునది లేక ఏదాని ఎన్నుకున్నా అనర్గళంగా వాదించి అవతలవారిని చిత్తుచేసేవారు. శ్రీవారి పాండిత్యం నీలకంఠ దీక్షితులుగారిని నివ్వెర పరచింది. వారు ఒక ఏనుగు అంబారీపై శ్రీవారి సంకలనా గ్రంధాలన్నీ ఉంచి



పుర వీధుల్లో ఊరేగించి శ్రీరాయల పాండిత్యాన్ని వేనోళ్ళ పొగిడారు.

శ్రీవారు మధురలో మీనాక్షీ సుందరేశ్వరుల, రంగనాధుని ఆవాసమగు శ్రీరంగం పయనమయ్యారు.

శ్రీ రాఘవేంద్రులు ఆవిధంగా క్షేత్ర యాత్ర కొనసాగిస్తూ ఆఖరి మజిలీగా 'నామక్కల్' చేరారు. అది ప్రసిద్ధ నరసింహ క్షేత్రము. ఆ రోజుల్లో వెల్లూరు పాలకులు అలనాటి విజయనగర రాజుల వారసుడు. ఆ రాజు కూడా తన పూర్వీకులవలె కవి పండిత పోషకుడు. ఆయన శైవమతాభిమాని. వారి ఆస్థానంలో వీరభద్రుడు, భైరవభట్టు అని ఇద్దరు గొప్ప పండితులు రాజాశ్రయంలో ఉండేవారు.

**ఆ॥ రాఘవేంద్రుడంత రాజాశ్రయములోని**
**పండితులతొ జరిపె బహువిధముల**
**పేరు గాంచినట్టి వేదాంత చర్చలు**
**గెలుపు పొంది మధ్వ కీర్తి బెంచె**



ఆ చర్చలో రాఘవేంద్రుల ప్రతిభ జూచి రాజు గుర్తించి మధ్వమత స్థాపన తన రాజ్యంలో జరుగుటకు అనుమతించాడు. తన భక్తి చాటుకోటానికి శ్రీవారికి ఎన్నో మడులు మాన్యాలను సమర్పించుకున్నాడు. ఈ విధంగా రాఘవేంద్రస్వామి దక్షిణ దేశ పాండిత్య క్షేత్ర యాత్ర ముగిసింది.

## ఒక మనవి :

భవదీయుడు అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు. మేము అద్వైతులం. మా వంశమూలపురుషుడు భైరవభట్లు. ఈయన 1605 A.D. నాటి వాడు. స్మార్తులు అవటం చేత యజ్ఞ యాగాలు, క్రతువులు చేసి అందరూ సోమయాజులు, దీక్షితులు అనిపించుకున్నారు. పేర్లుకూడా నీలకంఠ సోమయాజులు, మృత్యుంజయ సోమయాజులు, తిమ్మన్న దీక్షితులు. భైరవ భట్టు గారి పూర్వం మా ఇంటి పేరు 'మండగొండి' వారు. భైరవభట్టు జీవితకాలం మారిన 'తరాలు' ఆధారంగా ఉజ్జాయింపుగా

లెక్కకడితే 1600 క్రీ.శ. అయి వుండాలి అని లెక్క తేలింది. కావున మా భైరవభట్టుగారు, ఈయన ఒకరే అవవచ్చును. రాఘవేంద్రుని ప్రియశిష్యులు వెంకణ్ణలాగ మా వంశ మూలపురుషుడు కూడా అక్షర జ్ఞానం లేనివాడే. సరస్వతీదేవి ముసలి ముత్తైదువు వలె వచ్చి క్షుదార్తుడై మూర్ఛనొందిన అతనికి అంబలి త్రాపితే ఆయన రెండు దోసిళ్ళ తర్వాత కడుపు నిండింది తల్లీ అన్నాడుట. దాని కావిడ ఓరి దురదృష్టవంతుడా ఇంకొక్క గుక్క తాగితే గురువు లేకుండానే పండితుడివయ్యేవాడివని ఆయనను ఇంకొక్క గొప్ప గురువు వద్దకు పంపిందట. భైరవభట్టు తర్క శాస్త్రంలో ఉద్దండుడై, ఒకరాజు ఆస్థానంలోని పండితుడిని ఓడిస్తె ఆయన ఔరావాదీ అన్నాడుట. అప్పటి నుంచి భైరవభట్టుగారు 'మండగొండి భైరవభట్టు' కాక 'ఔరావాది భైరవభట్టుగారు' అయ్యారు. కొంతకాలానికి ఔరావాది, అమరవాదిగా మారింది.

ఇదే నిజమయితే నా జన్మ ధన్యం.

మహామహులచేత ఓటమికూడ గర్వించ తగినదే.



శ్రీవారు దక్షిణ యాత్ర పరిసమాప్తి చేసికొని, దక్షిణ కన్నడ జిల్లాలో తన యాత్ర ప్రారంభించారు. శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన జయసింహరాజు ఏలిన స్థలమది. రాఘవేంద్రులు శ్రీహరి క్షేత్రమయిన విష్ణుమంగళమును, శివక్షేత్రమయిన సుబ్రహ్మణ్య క్షేత్రమును దర్శించి ఉడుపి క్షేత్రము చేరుకున్నారు. స్వామివారి పరమగురువులు విజయేంద్ర తీర్థులకు అక్కడ శ్రీకృష్ణుని ఆలయమునానుకుని కొంత స్థలమున్నది. రాఘవేంద్రులు అచ్చట తన విడిది నేర్పాటు చేసుకున్నారు.

**కం॥ ఉడుపిలొ కృష్ణుని జూచిరి**
**కడు పరవశమంది కృష్ణగానామృతమున్**
**కడుపార గ్రోల స్వామికి**
**అడుగులు నాట్యంబు జేసె నానందముతో**

ఉడుపిలో నున్న కాలములో స్వామి యెన్నో చక్కని కీర్తనలు శ్రీకృష్ణునిపై వ్రాసి స్వయంగా వేణుగోపాలా అంటూ పాడారు.



ఇక్కడ శ్రీవారి గ్రంధ రచన వటవృక్షంలా విస్తరించింది. శ్రీవ్యాస తీర్థులు వ్రాసిన 'చంద్రికా' అనే గ్రంధానికి 'ప్రకాశము' అనే వివరణ వ్రాశారు. 'న్యాయ ముక్తావళి' 'తంత్రదీపికి' 'పరిమళ' అనే గ్రంధాలను కూడ వ్రాశారు. ప్రకాశమును గ్రంధ రచన ఆ రాఘవేంద్రస్వామి పూర్తి చేశారు.

**తే॥ దానినంకిత మిచ్చిరి పూని గురులు**
**ఉడిపి కృష్ణున కెంతయో యున్నతముగ**
**పెరుగు చిలికెడి కృష్ణుని విగ్రహమును**
**చెక్కి బంగారు బొమ్మను చేసినారు.**

ఈనాటికీ మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామి మఠములో ఆ బంగారు బొమ్మని భక్తులు తిలకించవచ్చు.

సంచారము నొనరించుచూ స్వామి మైసూరు పరిసర ప్రాంతమునకు చేరినారు. చారిత్రక ప్రాశస్త్యముగల శ్రీరంగ



పట్టణం చేరారు. దొడ్డ దేవరాజు దానిని పాలించు రాజు. శ్రీవారి పూర్వీకులైన విభుదేంద్ర తీర్థులు నివసించిన అచ్చటి సమీప ప్రాంతము 'నంజనగూడు' నందు స్వామి నివసించమని ప్రార్థించెను. ఆ ఏడు తమ చాతుర్మాస్యదీక్ష గురుదేవులు శ్రీరంగ పట్టణముననే నిర్వహించారు. ఆ సందర్భమున వల్లూరు, దేవరాజపురమును రెండు గ్రామములను శ్రీవారికి సమర్పించినాడు. తరువాత చిత్రదుర్గము వైపు తమ ప్రయాణము కొనసాగించినారు.

రాఘవేంద్రుని ఆశ్రయించి స్వామి దయవేడెడి భక్తుడొకడు తనకు ముక్తి నిప్పించమని వేడుకొనుచుండెడివాడు. ఒకరోజు ఉన్నట్లుండి స్వామి నీకు నిజముగా ముక్తి కావలెనా? ముక్తి ఈ శరీరముతో లభించదు. శరీర త్యాగము చేయగలవా అని అడిగినారు.

అప్పుడతను....

**ఆ॥ నీవు దూకమన్న నిప్పున దూకెదన్**
**శంక ఏల? నమ్ము స్వామి నన్ను**
**పేర్చి చితిని నేడె వీక్షించ మీరంత**
**తనువు వీడువాడ దగ్ధమవగ.**

ఆతడప్పటి కప్పుడె చితి పేర్పించి, స్నానమాచరించి, శుద్ధిజెంది స్వామి తీర్థము స్వీకరించి స్వామిచే బీజాక్షరములు వ్రాయబడిన ఆ నిప్పులో రాఘవేంద్రుని స్మరించుచూ దూకెను. చిత్రముగా క్షణకాలమును అతడు దగ్ధమై పోయినాడు. (నేటి కాలంలో అందరికీ తెలిసినదే ఈ పని జరుగుటకు కనీసం నాలుగైదు గంటలు పడుతుంది. ఎలెక్ట్రిక్ ఓవెన్స్‌లో లాగా కట్టెల చితిలో బూడిద మాత్రమె మిగలటం అసాధ్యం. వాయుదేవునీ అగ్నిదేవునీ ప్రార్థించి స్వామి ఆ వింత చేశారు. ఆ జీవిని అలా ముక్తుణ్ణి చేశారు.



రాముడుంటే రావణుడూ ఉంటాడు కదా. రాఘవేంద్రుల్ని ద్వేషించే కొందరు స్వామి శిష్యుని భ్రమింప (హిప్నటైజ్) జేసి వాని చావుకి కారణమైనారని విమర్శించ సాగారు. తక్షణమే ఒక అద్భుతం జరిగింది. ఆ విమర్శించు వారికి ఒక అద్భుత దృశ్యం కనబడింది. ఘంటానాదం వినిపిస్తుండగా, ఆకాశ వీధిలో మెరుస్తున్న దివ్య విమానంలో చనిపోయిన ఆ భృత్యుడు ఊర్ధ్వ లోకాలవైపు పోతూ కనిపించాడు. మోక్షదాత శ్రీహరి అనుమతిస్తె వాయుదేవుడు అట్టి దివ్య విమానం అమరిస్తాడు. అది మానవులకు కనబడదు. అయితే రాఘవేంద్రులు తనమీద అపనింద వేయబోయిన వారికోసం అసదృశమైన ఆ విమాన దర్శనం చూపించారు గాని అది సామాన్యునికి కనిపించదు. మనం ఎన్నడూ చూడని ప్రదేశంలోనే గైడ్ అవసరం అవుతుంది కదా. మరి ఇంకొక లోకం ఎలా చేరగలం? తప్పకుండా ఎవరో వచ్చి తీసుకు వెళ్తారు. ఇది నిజం. వివరాలు మాత్రం బ్రతికుండగా తెలుసుకోవడం అసాధ్యం. మనం చూడ లేనిది అసలు లేదనే వాడు మూర్ఖుడే కదా.



అచటనుండి శ్రీవారు 'గడగ్' చేరారు. అక్కడ వీరనారాయణుని కొలిచారు. అక్కడనుండి కిరీటగిరి అను గ్రామమును చేరారు. అక్కడ వెంకట దేశాయ్ అను సంపన్నుడు స్వామిని తన ఇంట భిక్షకు ఆహ్వానించాడు. స్వామి శిష్యులే గాక అతని బంధు పరివారమంతా విచ్చేశారు. అతనికి పెద్ద మామిడి తోట ఉంది.

**కం॥ మామిడి పండ్ల రసంబును**
**స్వామికి రుచి చూపనెంచి సద్భక్తుడు, ఆ**
**మామిడి రసమొక తొట్టెలొ**
**ఏమాత్రము శంకలేక ఇంపుగనింపెన్**

అప్పుడొక దుస్సంఘటన జరిగింది. యజమాని కొడుకు చిన్న బాలుడు ప్రమాదవశాత్తు ఆ తొట్టెలో పడి మరణించాడు. బయటకు చెప్పుకుని ఏడవలేని పరిస్థితి. భోజనానికి కూర్చొనకుండ స్వామి లేచిపోతే చేసిందంతా నిష్ఫలం.



స్వామి వేంకట దేశాయ్ దంపతులకు తీర్థం ఇస్తున్నప్పుడు వారు దుఃఖం ఆపుకోలేక భోరుమన్నారు. స్వామి విషయం తెలుసుకుని, మంత్ర జలం చిలకరించి అత్యద్భుతంగా బాలుని పునర్జీవితుని చేశారు. కృతజ్ఞతగా దేశాయి, స్వామివారి శ్రీ పీఠమునకు ఆ గ్రామమును సమర్పించాడు. యోగులకు అపమృత్యువు అనగా అకాల మృత్యువును పరిహారం చేయగల దివ్యశక్తి ఉంటుంది. ఒకవేళ అది సకాల (బ్రహ్మ నిశ్చయించిన) మృత్యువయితే ఎవరేం చేయలేరు.

సవణూరు నవాబు గారి కుమారుడు విషసర్పం కాటుకు గురయి అకాల మరణం చెందాడు. స్వామి ఆ యువరాజుని పునర్జీవితుని చేశారు కేవలం మంత్రజలంతో. కృష్ణాపురం తదితర పల్లెలను స్వామికి కృతజ్ఞతతో కానుకగా సమర్పించాడు సవణూరు నవాబు. తరువాత స్వామి 'శరసంగి' అనుగ్రామము చేరుకున్నారు. అక్కడ వీరశైవులు అధికము.

**కం॥ హరుడే శ్రేష్ఠుడు అందురు**
**హరినామము నాల్కదాల్చరా శివభక్తుల్**
**వారలు బ్రాహ్మణ ద్వేషులు**
**వారా గురుశక్తిజూడ బాల్పడి రచటన్**

రాఘవేంద్రుని పరీక్షించనెంచి ఆ వీరశైవుల నాయకుడైన ఆ గ్రామదేశాయి ఒక ముసలము (రోకలి) ను తెప్పించి దానిని తిరిగి చిగురించునట్లు జేసిన హరి గొప్పతనము నంగీకరించెదనని సవాలు చేసెను. వేద మంత్రములు నిజముగా మహిమాన్విత ములని అంగీకరించెదనని పలికెను.

**ఆ॥ వేదమంత్ర మహిమ వివరించి బోధించె**
**స్వామి వాటియొక్క శక్తి జూపె**
**సొంపు మీర జదివి సుశ్రావ్య కంఠాన**
**మహిమ జూపె గురుడు అహము బాప**



ఆ వేదమంత్రోచ్చారణతో అద్భుతముగా ఆ మొండి రోకలి చిగురించి ఆకులు మొగ్గలు తొడిగినది. ఇక ఆ వీరశైవులు బ్రాహ్మణ్యపు గొప్పతనం అంగీకరించారని వేరే చెప్పనక్కరలేదు కదా! శ్రీవారి పండరీపుర యాత్రలో వారి పరిచారకుని భార్య ప్రసవ వేదనతో నొప్పులు ప్రారంభమయి నీరుగాని వసతిగాని లేక రాఘవేంద్రా నీవే దిక్కు అంటే అన్నీ విచిత్రంగా ఎవరో పంపించినట్లు సమకూడి ఆమె పండంటి మొగబిడ్డను కన్నది.

శేషుడను పండిత శ్రేష్ఠుని ఒక గ్రామములో విజయీంద్ర తీర్థుల రచన 'వాగ్వైఖరి' ప్రమాణముగా వాదించి శేషుని అతి తేలికగా ఓడించారు.

**ఆ॥ పండరీపురమున పాండురంగని గొల్చి**
**కొల్హపురమునందు గురుడు బూని**
**జేరి గొలిచినారు శ్రీమహాలక్ష్మిని**
**వారు 'నాసికు' నకు అరిగిరంత**



నాసిక్‌లో పవిత్ర గోదావరీ నది స్నానమాచరించినారు. క్షుదార్తుడై ప్రాణాపాయ స్థితిలో నున్న ఒక పేద బ్రాహ్మణుని స్వామి కాపాడినారు. తదుపరి మజిలీ అయిన బిజాపురంలో రెండవ ఇబ్రహీం అదితషా అను తురుష్క రాజుని జూచి ఆశీర్వదించారు. అన్నిమతముల పరమోద్దేశ్యం ఒక్కటేనని నమ్మే ఆ రాజు శ్రీవారిని కొలిచి జగద్గురువులు అని బిరుదమునిచ్చి శ్వేతఛత్రము వంటి రాజచిహ్నములతో గౌరవించాడు.

అక్కడినుంచి రాఘవేంద్రులు కృష్ణానదీ తీరం చేరి 'అల్లూరు' అనే గ్రామం చేరారు. అక్కడ కొన్నాళ్ళు గడిపి తత్త్వ మంజరి అను పేరుగల టీక సూత్ర అనుభాష్యమునకు రచించారు.

ఆ తరువాత రాయచూరు జిల్లాలోని 'మానవి' గ్రామం చేరి చాతుర్మాస దీక్ష స్వీకరించారు.

కర్మబంధములచే మాత్రమే జన్మలు కలుగును. దానము చేయని వారికి ఇతర పుణ్యముల వలన అంతులేని



ధనమున్ననూ సంతానముండదు, అందుచేతనే ఇతరులకు తిండి పెట్టాలి. ఎవరి వద్దా దానము స్వీకరించరాదు. ఒకవేళ ప్రాణాపాయ స్థితిలో స్వీకరించినా శ్రీకృష్ణార్పణమస్తు అని స్వీకరించి దానము చేసిన వారి సమస్త సన్మంగళమస్తు అని ఆశీర్వదించాలి. ఈ నియమం పాటించక పోతే జన్మ బంధం తప్పదు. ఆలయంలో పూజారి చేసేది ఇదే.

శ్రీవారి మూలరామపూజ జరుగుచుండగా ఒకనాడు ఒక అద్భుతం జరిగింది.

**చం॥**
**దళితుడు యొక్కడచ్చటికి తన్మయ మందుచు వచ్చి జేరితాన్**
**పలుకుల తేనెలూర పలు ప్రశ్నలు వేసెను స్వామిగూర్చియున్**
**పులకితగాత్రుడై గురుడు పోల్చెను వానిని పూర్వజన్మలో**
**తలచెను శిష్యుడౌ కనకదాసనుచున్ గని ఖిన్నులైరిగా**

మహా యోగులు పోల్చగలరు. సామాన్యులు పోల్చలేకపోయినా ఏదో తెలియని ప్రేమ కలుగుతుంది. వివాహం ఏడేడు జన్మల బంధమన్నది అందుకే. ఇక్కడ స్వామి కనకదాసుని జూచి నీ స్వంత సంపాదనతో ఏదైనా రేపు మూలరామునికి నైవేద్యం పెట్టుటకు తెమ్మన్నారు. అతను గుప్పెడు ఆవాలు తెచ్చి సమర్పించాడు. స్వామి అది శిష్యులకిచ్చి ఆరోజు వంటలో ఆ ఆవాలు విరివిగా వాడాలని చెప్పారు. అయిష్టంగానే ఆజ్ఞ అమలు జరిగింది ఎందుకంటే ధనుర్మాసంలో ఆవాలు నాలికకు తగలనివ్వరు శ్రోత్రియలు. నైవేద్యం పెట్టి మూలరాముని అర్థించి కనకదాసుని ముక్తుని చేయమని వేడుకున్నారు. కనక దాసుకి తీర్థం ఇచ్చారు. తీర్థం తీసుకున్న తక్షణమే అతను కట్టెలా పడిపోయి ప్రాణం విడిచి ముక్తుడయ్యాడు. గుసగుసలాడిన శిష్యులు గుడ్లప్పగించి చూశారు. ప్రహ్లాదుడి కోసం శ్రీహరి ఎన్ని అవస్థలు పడ్డాడో చూడలేదా, తన భక్తుడికి బాధేకాదు, కోపం వచ్చినా ఆయన తట్టుకోలేడు తన భక్తునికి కోపం తెప్పించిన వాడిపని పడతాడు.



కనకదాసు ముక్తుడైన రోజు గుసుస్తూ శిష్యులంతా ఆవాలు రుచి చూశారు గాని బిదరహళ్ళి శ్రీనివాసాచార్యులను పండితుడు మాత్రం ససేమిరా ఆవాలు తాకనన్నాడు. బ్రాహ్మణుని అభోక్తగా పంపరాదని స్వామి వాని ఒక్కనికోసం మరల వంట చేయించారు. అప్పుడు మాత్రమే అతను తీర్థం అక్షతలు స్వీకరించాడు. నెమ్మదిగా స్వస్థలం చేరాడు.

**ఆ॥ మ్లాన వదనుడైన తన తమ్ముగమనించి**
**వాని అన్న అడిగె వాస్తవంబు**
**తెలుప, వేరు వంట తీరును విని అన్న**
**మందలించి స్వామి మహిమజూపె**

తమ్ముని కొంగుముడిలోనున్న మంత్రాక్షతలు నల్లగా మారిపోయి ఉన్నవి. అతడు తమ్ముని కఠినముగా నిందించి తక్షణమే క్షమాభిక్ష వేడమని స్వామి వద్దకు పంపెను. కన్నీటితో క్షమ వేడిన అతనిని దీవించి మూలరాముని నైవేద్యము నిచ్చి పంపారు రాఘవేంద్రులు.



వేద సంప్రదాయముగాక మధ్యకాలంలో కుహనా పండితులు అజ్ఞానంతో కొందరు సద్భక్తులను అవమానించి బాధింతురు. తన నివేదన స్వీకరించని శ్రీనివాసాచార్యులపై రాఘవేంద్రుల క్షణకాల ఆగ్రహం, మూలరామునికి అంతులేని ఆగ్రహం తెప్పించింది. పర్యవసానం రుచిచూచి లెంపలేసుకున్నాడు అజ్ఞాని. ఆనాడు అర్జునా! ఫలం, పత్రం, పుష్పం ఆఖరికి నీరు అయినా భక్తితో సమర్పిస్తె స్వీకరిస్తానని స్వయంగా భగవానుడు చెప్తే ఈ అహంకార శిఖామణులు యెప్పుడు తెలుసుకుంటారో కదా. స్వామి ఆ విధంగా కొంతకాలానికి సంస్థానముతో సహా 'కందనాతి' చేరుకున్నారు. తల్లిదండ్రులులేని అనాధ బాలుడు ఒకడు జీవనానికి గొర్రెలను కాస్తూ స్వామికి కనబడ్డాడు. ఏ పూర్వ జన్మపుణ్యం చేతనో, స్వామికి భక్తితో పాదాభివందనం చేశాడు. స్వామి వానిని ప్రేమగా దీవించి, కష్టం కలిగితే నన్ను తలుచుకో అన్నారు. ఈ జీవన నాటక రచయిత, దర్శకుడు ఆ శ్రీహరి. నాటకంలో ఒక అంకం అయితే కాని ఇంకొకటిరాదు. ఈలోగా ఆఖరికి ఆ దర్శకుడు కూడా ప్రేక్షకుడే. ఏమీ చేయలేడు, చేయడు కూడ. అందుకే రాఘవేంద్రులు ఆశీర్వదించారు అంతే.



'ఆదవాని' నగరం (నేటి ఆదోని) సిద్దీమసూద్ ఖాన్ అనే నవాబు పాలనలో యుండెడిది. అతను బిజాపూరు సుల్తానుకు కప్పం కడుతూ ఆదోని మండలాన్ని పాలిస్తున్న నవాబు. ఒకరోజు వచ్చి మార్గమధ్యంలో వార్తాహరుడొకడు అశ్వంపై వచ్చి సలాం చేసి సుల్తాను నుంచి లేఖ ప్రభూ అని లేఖనొకదానిని అందించాడు.

**కం॥ చదువుట రాదు నవాబుకు**
**'అదవానికి దూరమైన అడవైపోయెన్**
**వెదకుచు చదువరికై చనె**
**అదెవో కన్పడెను ముందు ఆ వెంకన్నే.**

బ్రాహ్మణ యువకునిలా కన్పిస్తున్న వెంకన్నకి చదువు వచ్చి ఉంటుందని తక్షణం ఆ లేఖ చదువమన్నాడు. చదువు రాదన్నాడతడు. తల నరుకుతా చదువు అన్నాడు నవాబు. రాఘవేంద్రా పాహి పాహి అని స్మరిస్తూ ఆ లేఖ చేతుల్లోకి

తీసుకున్నాడు. గొప్ప విచిత్రం జరిగింది. తనే ఆ ఉత్తరం వ్రాసినంత తేలికగా చదివాడు వెంకన్న. నవాబు సహాయంగా పంపిన సేన విజయం సాధించినదని సుల్తాన్ కృతజ్ఞతతో వ్రాసిన లేఖ అది. మసూద్‌ఖాన్ ఆనందానికి అంతులేదు. రాఘవేంద్రుని కృపావృష్టి కురియడం ఆరంభమైంది. గొర్రెల కాపరి వెంకన్న నవాబుగారి దివాన్ (మంత్రి) అయ్యాడు. ఇదంతా స్వామి దయకదా. ఇక అతను

**కం॥ ఎప్పుడు గురుదేతెంచును**
**ఎప్పుడు తనవృద్ధి జూపి ఈప్సితమొదవన్**
**ఎప్పుడు కాలికి మొక్కెద**
**ఎప్పుడు నాఋణము దీరు నీవిధి దలచెన్**

తమ తీర్థయాత్రలో స్వామి శ్రీముష్ణము అను ఊరు దర్శించారు. ఒకప్పుడు శ్రీమధ్వాచార్యుల వారు అక్కడికి వచ్చి దండతీర్థమను కోనేటిలో స్నానమాచరించారు. నేటికీ ఆ కోనేరు ఆ సంఘటనకి



సాక్ష్యంగా నిలిచియున్నది.

ఆ విధంగా దీర్ఘ యాత్ర తరువాత స్వామి కుంభకోణం చేరుకున్నారు. పూర్ణకుంభ స్వాగతం లభించింది. స్వామివారికి మంగళ హారతులిచ్చారు.

**తే॥ స్థలము మారెడి సమయము సంభవించె**
**పాలనా పరమైనట్టి పలు విధముల**
**మార్పులొనరించిరా స్వామి మఠములందు**
**'ఆదవానీ' నగరు చేరు ఆదిలోనె**

ఆ కార్యక్రమంలో శ్రీచక్రపాణి, సారంగపాణి దేవాలయముల ఆధ్వర్యము అహోబిల మఠమునకు అప్పగించారు. కుంభేశ్వర దేవాలయము కంచి కామకోటి మఠమునకు అప్పగించారు. నవబృందావనం వెళ్ళి తన గురువు శ్రీ సుధీంద్ర తీర్థులను మనసార స్మరించి పూజించారు. ఆపై శిష్యసమేతంగా ఆదవానీ (ఆదోని) నగరమునకు బయలు దేరారు. ఇది వరలో శ్రీ



రాఘవేంద్ర తీర్థుల కృపారసంబును గ్రోలిన వెంకన్న అను గొర్రెల కాపరి విద్య అనాయాసంగా పొంది ఆదవాని నవాబు సిద్ధిమసూద్‌ఖాన్ గారివద్ద దివాను అయిన సంగతి తెలిసినదే.

**ఆ॥ వేయి కనులతోటి వెంకన్న స్వామికై**
**వేచియుండె దారి కాచియుండె**
**భక్తుగోర్కె దీర్ప వచ్చివిడిది జేర**
**దెలిసె జేరిరెల్ల దివ్యుజూడ**

బిజాపురు సుల్తాను గారే స్వామి దీవెనలు పొందాడంటే వాని సామంతుడు ఆదవాని నవాబుకి స్వామిని జూడటం తప్పనిసరి. నిత్యమూ వెంకన్న వేయినోళ్ళతో పొగడుతుండే స్వామిని పరీక్షించాలనిపించింది ఆ తురుష్కునకు. రానున్న రోజుల్లో ఇదే నవాబుద్వారా వెంకన్న ద్వారా జరుగబోయే జగత్కళ్యాణ కార్యక్రమం తెలిసిన వారు గనక స్వామి, తమ దర్శనం కోరిన నవాబుకు మరుదినం రావలసిందని ఆహ్వానం పంపారు.



**శా॥**
**హేయంబైన మనస్సు తాను తలచున్ హీనంబుగా నన్యులన్**
**ఆయాలోచన లేని తుంటరియు తానా రాఘవేంద్రున్ కిడెన్**
**మాయోపాయముజేత దాచి రుధిరం మాంసంపు ఖండంబులన్**
**బోయెన్ స్వామికి మొక్కిపెట్టమనె ఆ భోజ్యంబు నైవేద్యమున్**

చాకచక్యముగా కళాత్మకమైన దివ్య వస్త్రాలలో ఉంచిన ఆ కుత్సితం స్వామికి తెలియదా? వెంకన్న బాధ పడుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి. స్వామి చిరునవ్వుతో మంత్రజలం ప్రోక్షించి "దివ్య ఫలపుష్పాని నైవేద్యం సమర్పయామి" అన్నారు. అని వెంకన్నను నైవేద్యం పంచి పెట్టమన్నారు. మసూద్‌ఖానుగారి మాట పడిపోయినంత పని జరిగింది. ఆ నైవేద్యం పండ్లూ పుష్పాలే. ఇక మసూద్‌ఖాన్ గారు...

కం॥ **కడిగెను పదములు వెచ్చని**
**తడియారని కంటినీట దయ, క్షమ వేడెన్**
**యెడయక బ్రోచెడి స్వామియు**
**కడుపుణ్యము మూలరాము కరుణగుననియెన్**

అటుపైన తన పాప పరిహారార్థం స్వామికి ఏదైనా ఇస్తాను అడగమన్నాడు. స్వామి నిస్సంకోచంగా ఆదవాని తాలూకాలోని మంచాల గ్రామం తమకొసంగమని అడిగారు. ఇంకా పెద్ద గ్రామాన్ని కోరమని ఎంత వేడినా స్వామి ససేమిరా అన్నారు.

మసూద్ ఖాన్ మంచాల గురించి విచారించగా అది ఒక కాజీకి ఇదివరకే ఈయబడిందని తెలిసింది. ఆ కాజీకి వేరొక గ్రామము నొసగి స్వామికి మంచాలను అర్పించి తన ఆశయం నెరవేర్చుకున్నాడు. తను ఋణ విముక్తుడయ్యాడు.



తే॥ **పర్యవేక్షించి ఆ పని భక్తుడైన**
**తాను వెంకన్న తనుగూడ తనదు ఋణము**
**తీర్చుకొని కొంత సేదను దీరినాడు**
**నేడు మంత్రాలయంబదె, నిజము, దివియె.**

తదుపరి మంచాల రాఘవేంద్రుల ప్రియనివాసమై భక్త జన వైకుంఠంగా మారింది. వేంకటేశ్వరుని వర ప్రసాది కనుక మంచాలలో స్వామి చక్కటి వేంకటేశ్వర ఆలయం నిర్మించిరి. దివాను బాధ్యతలు నెరవేరుస్తూ గూడ వెంకన్న తరచుగా మంత్రాలయం వచ్చి స్వామిని సందర్శిస్తుండేవాడు. ఒకసారి స్వామి వానిని తుంగభద్ర తీరమునకు తీసుకుని వెళ్ళి ఒకచోట భూమిని త్రవ్వమన్నారు.

ఆ॥ **హోమకుండ మొకటి తమకంటబడగానె**
**చేష్టలుడిగి పోయె శిష్యునకును**
**నారసింహస్వామి నాటి ప్రహ్లాదుడు**
**తిరిగి రాఘవేంద్ర తీర్థులయ్యె**



నాటి కులదేవత మాంచాల శివపత్ని స్వరూపిణి నేటి ఈ మాంచాల గ్రామ కారణభూతురాలు. ఇంకొక విశేషమేమంటే ద్వాపర యుగంలో జైత్రయాత్రకు వెళ్ళిన అర్జునుడు ధనంజయుడైనప్పటికీ, ఈ హోమకుండమును కప్పియున్న నేలపై రధమును నిలిపియున్న అఋసాల్వుడను రాజు చేతిలో పరాజితుడై ఆఖరికి శ్రీకృష్ణ భగవానుని సలహాతో యుద్ధభూమి మార్చి మాత్రమే గెలువ గలిగాడు. ఆ స్థలమహాత్యము, స్వామివారి పూర్వజన్మ గురించి విన్న వెంకన్న పరమానంద భరితుడై స్వామిని కర్తవ్యం అడిగాడు.

తే॥ **పరిసమాప్తమౌ ఈ జన్మ 'వంత' యేల?**
**నాదు బృందావనంబట ఒదవజేయ**
**స్థిర నివాసమై నాఆత్మ దీనజనుల**
**గాచు కంటికి రెప్పలా కాలగతిని**



క్రీ.శ. 1671 విరోధికృత్ నామ సంవత్సరమున స్వామివారు ఆషాడమాసమున చాతుర్మాస్య దీక్ష నారంభించారు.

రాఘవేంద్రులు మంత్రాలయాంబిక (మంచాలమ్మ) ను నిత్యమూ ఆరాధించుచున్నారు. శ్రీవారికి దర్శనమిచ్చిందా దేవి. భక్తుల కోర్కెలు గ్రహించి శ్రీహరి మరియు రాఘవేంద్రుల దివ్యాత్మ ద్వారా తీర్చించి సహకరించెదననియు తనకు మృగ బలి అవసరం లేదనియు తన ఆలయం గర్భగుడి గోడలపై మేక తలల ఆకృతులు చెక్కించిన చాలుననియు తను వాటిద్వారా తృప్తిజెంది దుష్టశక్తులను నిరోధించెదనని తెలిపి అదృశ్యమయ్యెను. స్వామి ఇకపై విధి నిర్దేశ్యమట్లు ఒక్కొక్క పని పూర్తి చేస్తున్నారు. నేటికీ అవియన్నియు భక్తులకు కనువిందుగా కనిపించును.

ఇక తన ఉత్తరాధికారిని మఠ సంచాలకుని యెన్నుకొన వలెను. తన పూర్వాశ్రమమున అన్నగారు గురురాజుల వారి

మనుమడు వెంకణ్ణాచార్యులను పిలిపించి తనకు సుధీంద్రులిచ్చినట్లే సన్యాసదీక్ష నొసంగి యోగీంద్ర తీర్థులని ఆశీర్వదించారు. దివాన్ వెంకన్నను ఆతనికి అండగా నుండమని ఆదేశించారు.

**తే॥ రాతి పలకల తెప్పించి రమ్యమైన**
**తనదు బృందావనంబును బూని నిలుప**
**గోర, రాఘవేంద్రుల మాట మీరలేక**
**తక్షణంబె అద్దాని నాతండు నెరపె.**

అయితే స్వామివారు వెంకన్నతో నాయనా! తొందరపడ్డావు. నే కోరిన రాతిపలక ఇదికాదు. అది ఇక్కడకు దగ్గరలోనేగల మాధవరం గ్రామంలో ఉంది. దానిని తెప్పించు. నీవు ఇంత వేగంగా శ్రమకోర్చి నిర్మించిన ఈ బృందావనం వృధాకాదు. రాబోవు కొన్ని తరాల తర్వాత ఇది ఒక గొప్ప యోగీశ్వరునకు బృందావనం అవుతుంది. నా బృందావనం నిర్మించిన పుణ్యం



మాత్రం నీకు ఈక్షణమే కలిగింది అన్నారు. ఆ రాతికోసం నా ప్రయత్నం ఎందుకంటే

**కం॥ జానకి కొరకై వెదకుచు**
**ఆనాడా కోసలేంద్రుదాయాసముచే**
**ఆనించెను తన తనువును**
**ఐనా అది ఒక్క క్షణము అరుదు శిలగదా!**

కూర్చున్న ఆంజనేయ స్వామి వారిలా ఉండే ఆ శిలను గుర్తించుట అంత కష్టంకాదు అన్నారు. తక్షణం మాట కార్యరూపం దాల్చింది. ఆంజనేయాకృతితో వున్న భాగముతో పవనాత్మజుని చెక్కించి మిగిలిన దానితో రాతిపలకలు తయారు చేశారు.

స్వామివారు సశరీరంగా బృందావనంలో ప్రవేశిస్తారని తెలిసి ఇసుక వేస్తె రాలనంత ప్రజావాహిని వచ్చింది స్వామి అంతిమ దర్శనం కోసం. ఆయన పూర్వాశ్రమ బంధువులు నేటి శిష్యులు, భక్తులు జరుగబోయే అద్భుతం చూడవచ్చారు.



పైన ఒక్కరాతి పలక తప్పించి బృందావనం (సమాధి) సిద్ధమైంది.

అది క్రీ.శ. 1671 నాటి విరోధికృత్ నామ సంవత్సర శ్రావణ బహుళ ద్వితీయం. తెల్లవారింది. ఇకపై స్వామి కనిపించరన్న ఊహే ప్రజల్ని బావురుమనేలా చేస్తోంది. అయినా తప్పదు. స్వామివారు ఆహ్నికాలు ముగించుకుని భక్తులకు, శిష్యులకు శుభాశీస్సులిచ్చారు. దుఃఖించవద్దని వారికి ఏపాపం అంటదని తను యోగ సమాధిలోనే శరీర త్యాగం చేస్తానని ఆ తరువాత తన శరీరంపై బృందావనం నిర్మిస్తారు కావున ఏ దోషమూ లేదని సన్యాసులు అట్లు శరీర త్యాగం చేయడం అనాదిగా ధర్మబద్ధమేననియు తన శరీరాన్ని జీవుడు వీడిన సమయము నెరుగుటెట్లనగా అప్పుడు తను తిప్పుతున్న జపమాల చేతినుండి జారి పడుతుందని ఆ తరువాత బృందావనంపైనున్న రాతిపలకను మూసి బృందావన నిర్మాణం ముగించాలని ఆదేశించారు. శ్రీ మూలరాముని మనసారా పూజించి,



సర్వులకు తీర్థము మంత్రాక్షతలనిచ్చి, ఆశీర్వదించారు. దివాన్ వెంకన్నను దగ్గరకు పిలిచారు. తను బృందావనంలో 700 సాలిగ్రామములు జపమాలతో ప్రవేశించి సాలిగ్రామములను తన చుట్టూ పెట్టించుకున్నారు. శ్వాస నిరోదించి ధ్యానంలో నుండగా ఉన్నట్లుండి జపమాల ఆగిపోయి చేతిలోంచి జారిపోయింది. పద్మాసనంలో స్వామిమాత్రం అలాగే ఉన్నారు. హంసలేచిపోయింది. చివరి సాలిగ్రామమును ఉంచి పై రాతిపలక కూడ మూసి వేశారు. హరిదాసుల హరినామ సంకీర్తనలు, వైదిక బ్రాహ్మణుల వేదఘోష ఒక్కసారిగా ఆగిపోయాయి.

**ఉ॥**
**కాలువలాయె అశ్రువులు కంఠములన్నియుపూడిపోయె ఏ**
**నాలుక పల్కదాయెను మనంబులు మూగయి యేడ్చిరెల్లరున్**
**కాలము ఆగిపోయినది కమ్మెను శోకపు చీకటెల్లడన్**
**కాలుడు క్రూరుడంచనుచు గట్టిగ దిట్టిరి భక్తకోటియున్**

శ్రీరాఘవేంద్ర తీర్థులు తమ బృందావనంలో విశ్రమిస్తున్నారు. ఈ విషాదం ఊహాకందదు. నిజంగా మనసు మూగపోయి నట్లనిపిస్తుంది. ఈ సంఘటన వ్రాయటం కూడ బాధాకరమే. పాపము శమించుగాక. దైవ నిర్ణయం శ్రీహరి ఇచ్ఛ నెరవేరక తప్పదు. ఆ స్వామి నిజంగా, మా అమ్మ మా నాన్న మా చెల్లెలు అని మానవుల వలె ప్రవర్తిస్తే, అసలు విధి వ్రాత జరుగుతుందా?

**సీ॥ కన్న తల్లియు నేడ్చె కన్నీరు మున్నీరు**
**పెంచిన తల్లియు బెక్కియేడ్చె**
**తోబుట్టు తుదిలేక దుఃఖాగ్ని రగిలెను**
**అష్ట భార్యలు యేడ్చిరయ్యవలచి**
**మేనత్త ఏడ్చెగా తాను విధికి లొంగి**
**పాంచాలి కన్నీరు వరదలాయె**
**ముద్దుకై గోపెమ్మ మునుముందుగా నేడ్చె**
**వెన్న కుండలు చిట్లె వెలదు లేడ్వ**



**ఆ॥ వారు వీరు కాదు వనితెవ్వరేడ్వరు?**
**ఏమి కలుగునీకు ఇంతులేడ్వ?**
**బాధకోర్వ గలరె వనితలు వేలలు**
**హే ముకుంద! కృష్ణ! యేమిటయ్య?**

ఈ విధంగా మానవులం కాబట్టి మనం అజ్ఞానంతో ఏడుస్తాం. ప్రతి కన్నీటి బొట్టుకు ఆయనకి మాత్రమే తెలిసిన కారణం ఉంటుంది. అది తెలియక ఆ పరమాత్మను నిందించరాదు. శ్రీరాఘవేంద్రులు అవతరించిందీ పరమాత్మ ఆజ్ఞతోనే, బృందావనంలో చేరిందీ ఆయన ఆజ్ఞతోనే. ఆ నియంత ఎవరి మాట వినడు. ఈ సంఘటన జరిగి నేటికి 333 సంవత్సరాలయింది. ఆశ్రీకృష్ణ పరమాత్మ దయవల్లనే, అతి సాధారణ వ్యక్తి ఈనాడు శ్రీరాఘవేంద్ర తీర్థుల చరిత్ర ఈ విధంగా మీకు అందించగలిగాడు. ఇదే దైవేచ్ఛ అంటే.

ఇక ముక్తాయింపు.



శ్రీరాఘవేంద్రులు బృందావనం జేరిన ప్రతి శ్రావణ బహుళ ద్వితీయ తిథినాడు, బ్రహ్మాండమైన అన్న సంతర్పణతో పండుగవలె జరుగుతుంది. దాంట్లో పాల్గొన్నవారు ధన్యులు. స్వామివారి తర్వాత పీఠాధిపతి ఇలా అన్నారు.

శ్లో॥ దుర్వాదిధ్వాంతరవయే వైష్ణవేందీవరేందవే!
శ్రీరాఘవేంద్ర గురవే నమోஉత్యంత దయాళవే!!
- శ్రీ యోగీంద్రతీర్థులు.

**తే॥ తీవ్ర దుర్వాదులనియెడి తిమిరములకు**
**భానుడున్, నల్లకలువలౌ వైష్ణవులకు**
**చంద్రుడున్ స్వామి శ్రీరాఘవేంద్ర గురులు**
**నా నమోవాకములు ఇవే నన్నుగావ.**

తా॥ గొప్ప దుర్వాదులనే చీకట్లను తొలగించు సూర్యభగవానుడును వైష్ణవులనబడు నల్లకలువలకు చంద్రుడును



అయిన శ్రీరాఘవేంద్ర స్వామి గురుదేవులకు ఇదే నమస్కరించు చున్నాను. (నన్ను రక్షించు గాక)

శ్రీ రాఘవేంద్రులు బృందావన వాసులయ్యాక వారి భక్తులు ప్రపంచాన్నే కోల్పోయినంత వ్యధ చెందారు. అప్పణాచార్యులవంటి పరమభక్తులు జీవితేచ్ఛే కోల్పోయారు. బిచ్చాలె అను తుంగభద్రానదీ తీరానగల గ్రామవాసి ఆ అప్పణాచార్యులు. తుంగభద్ర కద్దరి (అవతలి గట్టు) నున్న ఆ గ్రామం పండితుల స్థిరవాసం. అప్పణాచుర్యులు సంస్కృత పండితుడు. స్వామిపై ఎన్నో స్తోత్రములు రచించాడు. స్వామి బృందావనస్థులవుతారని తెలిసి పరుగు పరుగున తుంగభద్ర ఒడ్డుకు చేరాడు.

**కం॥ కట్టలు త్రెంచుకు పారెను**
**పట్టణములు పల్లెలన్ని వరదను మునిగెను**
**దిట్టుచు విధినా దీనుడు**
**తుట్టతుదిన్ రాఘవేంద్రుతో మొరపెట్టెన్**

అత్యాశ్చర్యకరంగా వరద తెరిపిచ్చి గట్లు కనబడడమే కాదు అప్పణాచార్యులు కాలినడకన నదిని దాటటానికి అవకాశ మిచ్చింది, తుంగభద్ర. ఇటువంటి అద్భుతాలు యెన్నని చెప్పగలం. తడి ఆరని బట్టలతో తడబడే అడుగులతో జీవంలేని చూపులతో స్వామి మఠం చేరాడు. దురదృష్టవశాత్తు సరిగా అప్పటికి ఆఖరి రాతి పలకను మూసివేశారు. అప్పణాచార్యుల ఆక్రోశానికి అంతేలేదు. గుండెలు బాదుకుని రోదిస్తున్నాడు. అతని నాపటం ఎవరి సాధ్యంగావడం లేదు.

అప్పుడు బృందావనంలోంచి మృదు మధురంగా ఇలా వినపడింది. “సాక్షీ హయాస్యోత్రహి”. బిగ్గరగా స్పష్టంగా వినబడ్డ ఆ మాటలకర్థం, ఈ స్తోత్రమునకు సాక్షాత్ హయగ్రీవ దేవుడే సాక్షి అని. అంటే అప్పుడు అప్పణాచార్యులు స్వామిపై రచించిన విషయాలన్నీ నిజము అని చెప్పటానికి, శ్రీవారిని గూర్చి చెప్పినదంతా అక్షరసత్యం అని అర్థం. అంటే స్వామి బృందావన వాసులై కూడ నిజ భక్తుల మార్గదర్శకులని నిరూపణ అయింది గదా.



**తే|| తేరి దిగ్భ్రమ నుంచి ఆ దీనుడంత**
**పూర్తి చేసెను స్తోత్రమున్ ఊరడిల్లి**
**స్వామి మెచ్చిన దానిని చదివినంత**
**కరుణ గురువులు కురిపించు కల్లకాదు**

ఆ తర్వాత అప్పణాచార్యులవారు, శ్రీవారి గుణగణములు నుతిస్తూ మంగళాష్టకమొకటి రచించారు. స్వామి అనుగ్రహం పొందారు. నేటికి భక్తులు అసంఖ్యాకంగా మంత్రాలయంలో మొక్కుకుని బృందావనానికి ప్రదక్షిణం చేసి ఈ స్తోత్రాలు పఠిస్తె అనుకున్న కోర్కె నెరవేరుతుంది. స్వామి కటాక్షం తక్షణం కలుగుతుంది.

**ఆ|| సాంప్రదాయ మిద్ది జరుగుచున్నది యట్లె**
**రాఘవేంద్రు గొలువ లక్ష్యమొకటి**
**మదిని బూని భక్తి మసలెడి వారికి**
**గురు కటాక్ష మెపుడు కురియుచుండు**



తనకు దివాన్ వెంకన్న కట్టించిన బృందావనాన్ని రాఘవేంద్రులు మృదువుగా తిరస్కరించి, శ్రీరామచంద్రుడు కూర్చున్న శిలతో తన బృందావనం నిర్మించాడని తెలిసింది కాని వెంకన్న నిర్మించిన బృందావనం అలాగే వుండిపోయింది. స్వామివారి ముని మనుమడు కూడ మధ్వపీఠం అధిరోహించి శ్రీవాదీంద్రులను పేరున ప్రసిద్ధి చెందారు.

ఆయన రాఘవేంద్రులు బృందావనస్థులైనప్పుడు రెండేళ్ళ శిశువు. రాఘవేంద్రుల తరువాత ఐదవ గురువుగా బాధ్యతలు స్వీకరించిన పరివ్రాజకుడు వాదీంద్రుడు. ఆయన “గురుగుణ స్తవనము” అనే సంస్కృత పద్య గ్రంథం రచించారు. ముప్పది ఆరు శ్లోకములు గల ఆ కావ్యము శ్రీ రాఘవేంద్రులకోసం ముని మనుమడు తన బృందావనం వద్ద కూర్చుని పఠించగా స్వామివారు సంతోషానికి గుర్తుగా వారి బృందావనం అటూ ఇటూ చెట్టుకొమ్మలా ఊపారట.



తన బృందావనం సమీపంలోనే దివాన్ వెంకన్న నిర్మించిన బృందావనంలో శ్రీవాదీంద్రుల బృందావనం కనబడుతుంది. రాఘవేంద్రుల బృందావనం దర్శించి తరువాత వాదీంద్రులది సందర్శించడం భక్తుల ఆచారం. శ్రీరాఘవేంద్రుల తన బృందావనం నుండే కర్తవ్యం బోధించి శ్రీ వాదీంద్రులతో ఎన్నో కార్యక్రమములు నెరవేర్చారు. శ్రీవాదీంద్రులు ధన్యజీవులు.

**తే|| నేటికైనను భక్తులు నిర్మితమగు**
**రాతి బృందావనంబును రమ్యమైన**
**దాని, వెంకన్న వెలయించు దాని జూచి**
**గురులు వాదీంద్రు దలచుచు కొలుచు చుంద్రు**

ఇవి కట్టుకథలు పురాణేతిహాస కథలు కావు 200 సంవత్సరాల క్రిందట (నేటి) ఆంధ్రరాష్ట్రంలో జరిగిన నిజ సంఘటనలు. ఇందులో కల్పనకవకాశమే లేదు. రాజుల చరిత్రలలో రవ్వంత పక్షపాత వైఖరి కనిపించవచ్చు! కాని మతగురువుల విషయంలో

అలా కాదు. దాపుననే ఉన్న అన్యమతస్థులు చూస్తూ ఊరుకోరు. అసత్య ప్రచారం సహించరు. విక్రమాదిత్యుడు రెండువేల సంవత్సరాలు రాజ్యపాలన చేశాడంటే అదీ ఉజ్జయిని రాజధానిగా అంటే మనం సందేహాలు వెలిబుచ్చవచ్చు. కాని కళ్ళెదుట కనబడుతున్న మంత్రాలయం కంటే శ్రీహరి భక్తుల గొప్పతనానికి సాక్ష్యం కావాలా?

నేను హిందువును, శ్రీహరి భక్తుణ్ణి, నావంటి వాడే కాదు భౌతికంగా కనిపించే దానినే నమ్మే తురుష్కులు, ఆంగ్లేయులు కూడా స్వామి మహిమ నంగీకరించారు. ఒకప్పుడు హరిదాసుల సంప్రదాయం ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాలలో విస్తృతంగా ఉండేది. వారు కవులు వాగ్గేయ కారులంతటి వారు కాకపోయినా విసుగులేక పల్లెల్లో ఇంటింటికీ తిరిగి 'హరిలో రంగ హరీ' అని భగవన్నామ సంకీర్తన చేస్తూ హరిలీలలు పాడుతూ ఆ ఇంటి వారు వేసిన భిక్ష స్వీకరించి దానితో జీవించేవారు. నేడు ఆ సంప్రదాయం కనుమరుగయింది. నేడేమిటి మనిషి 'చిన్ని



నా పొట్టకి శ్రీరామరక్ష' అనుకున్నప్పుడల్లా కనుమూసి, ధర్మచింతన కలుగు తున్నప్పుడు తిరిగి జీవించడం హరిదాస సంప్రదాయానికి అలవాటయిపోయింది.

విజయదాసు అను భక్తుడు చరిత్రలో స్థానం సంపాదించిన మధ్వ హరిదాసు. గొప్ప రాఘవేంద్ర భక్తుడు.

**ఆ॥ పేదలింట బుట్టి పేదగ జీవించి**
**పెరిగి యున్న యట్టి పేదరికపు**
**బాధకోర్వలేక ప్రతిరోజు ఇంటింట**
**బిచ్చమెత్తువాడు విజయదాసు**

విష్ణుదేవుడే సర్వోత్తముడు అని ప్రచారము చేసిన అతడు భృగు మహర్షి అవతారమని భక్తుల నమ్మకం. ఈ భృగు మహర్షి త్రిమూర్తులలో గొప్పయెవరో నిర్ణయించటానికి వెళ్ళి శ్రీలక్ష్మీ శ్రీహరి మధ్య చిచ్చు రగిల్చి శ్రీ వేంకటేశ్వరుడవతరించటానికి కారణమైనాడు. రాఘవేంద్రుని తరువాత ఆ మఠాధిపతిగా



ఆరవ గురువుగా ఆ పీఠ ప్రాశస్త్యాన్ని పెంచిన శ్రీవసుధేంద్ర తీర్థులు శ్రీ విజయదాసుగారి సమకాలికుడు. దాస సంప్రదాయానికి పునర్జన్మనిచ్చి శ్రీవిజయదాసు రాఘవేంద్రుని మహిమలు మూలబృందావనం యొక్క విశిష్టత హరికథలుగా చెప్పి హరిదాసులందరిని ఆనందపరచుటే గాక మధ్వ శ్రేష్ఠులలో విశిష్ట స్థానం సంపాదించాడు.

అదే విధంగా శ్రీరాఘవేంద్ర తీర్థుల వైభవమును నేలకు నాలుగు చెరగులా వ్యాపింప చేసిన మరొక మహనీయుడు 18వ శతాబ్దపు శ్రీజగన్నాథదాసు. వారి పూర్వ ఆశ్రమ నామము శ్రీశ్రీనివాసాచార్యులు. గొప్ప పండితుడు. కానీ

**కం॥ పండితులందరి నెత్తిన**
**యుండెడి గర్వంబు మదము ఓర్వనిగుణముల్**
**మెండుగ వారికిగూడా**
**ఉండుట విని విజయదాసు ఊరట మరచెన్**



మహానుభావులకి కొన్ని విషయాలు స్ఫురిస్తాయి. ఇది మనకు యుగాల నుండి తెలిసిన సత్యం. పురాణ యుగంలో దానినే దివ్యదృష్టి అనేవారేమో. ఒక సిద్ధార్థుడు, వివేకానందుడు అలా ప్రసిద్ధికెక్కినవారే. ఆంగ్లేయుడు దాన్నే వానిభాషలో అదేమాట చెబితే అహా! ఏం గొప్పవాడండి అంటాం. ఇప్పుడు ఇక్కడ ప్రస్తావించబడినది రాఘవేంద్రుని భక్తుడికి జరిగిన ఈ అనుభవం మాత్రం నిజం అని నమ్మటానికి వారి మనసంగీకరించదు. ప్రకృతి ద్వారా పరమాత్మ తన అద్భుతాలు చూపిస్తుంటాడు. మనం చూడనంత మాత్రాన అది లేదనటం అవివేకం. విజయదాసుల వారికి స్ఫురించిన సంగతి శ్రీనివాసాచార్యులు శీఘ్రమే మరణిస్తాడని. కాని భగవంతుడు శ్రీనివాసాచార్యుల కిచ్చిన పని నెరవేరటానికి 40 సంవత్సరాలు కావాలి. ఎలా? అద్భుతం జరిగింది. విజయదాసుల వారి శిష్యుడు శ్రీగోపాలదాసు. ఆయన ఆయుస్సు నూటికి పైనే.

**కం॥ అంతేవాసుని బిలిచిరి**

**అంతా వివరించి వానినడిగిరి దాసుల్**

**ఎంతో పుణ్యము నీదగు**

**చింతిల్లక నలుబదేండ్లు శీఘ్రమె ఇమ్మా**

అని వానినుండి నలుబదేండ్లు శ్రీశ్రీనివాసాచార్యులు మృత్యువు కోరలనుండి బయట పడ్డాడు. తను చనిపోయి మరల జీవించటం తెలుసుకున్న శ్రీనివాసాచార్యులు రాఘవేంద్రస్వామి వారి గొప్ప భక్తుడై శ్రీజగన్నాధదాసులై, పండరిపురం దర్శించి, తన గర్వాహంకారం విసర్జించి శ్రీ విజయదాసుగారి శిష్యుడై మధ్వ ప్రపంచానికి ప్రసాదించిన వరం లాంటి "శ్రీహరి కథామృత సారము" అనే బృహత్ కృతిని రచించారు శ్రీ జగన్నాధ దాసులవారు. శ్రీరాఘవేంద్రుల వారి మహిమను ఆయన గానం చేసిన విధం చాలా అద్భుతం.



ముస్లిం సామ్రాజ్యాధిపతులు సామంతులు రాఘవేంద్ర స్వామి మహిమను గుర్తించి వినమ్రులైన సంగతి తెలిసినదే కానీ ఆయన బృందావనస్థులైన 150 సంవత్సరాలకి ఒక ఆంగ్లేయ దొరకి తను సజీవుడనని చూపి ప్రభుత్వ అధికారిక "గెజెట్" లో ఆంగ్లంలో ఆ సంగతి ప్రచురించబడటం కంటే అద్భుత ముంటుందా!

**ఆ॥ దైవ మహిమ తెలియ ధరణినసాధ్యంబు**

**ఎవడు నేర్వగలడు యెన్నడైన**

**కనుల కానరాడు కనుక లేడన్నచో**

**భూమి ద్రిప్పునెవడు పోల్చగలరె?**

మనకర్థం కాని విషయాలు మహిమలు చాలా ఉన్నాయి, మన సమాజంలో. ఆంగ్లేయుల పాలనలో భారతదేశమున్న A.D. 1812 వ సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీలో బళ్ళారి జిల్లాకు కలెక్టర్‌గా మేజర్ థామస్ మన్రో అను ఆంగ్లేయుడు



పని చేయుచుండెను. యజమాని సజీవంగా లేని దేవాదాయ ఆస్తులను ప్రభుత్వము స్వాధీనము చేసుకో వచ్చునని ఒక శాసనము జేసి దాని అమలుజేయు బాధ్యత కలెక్టర్లపై నుంచినది. 1820లో మంత్రాలయ యజమాని రాఘవేంద్రులు జీవించి లేరు గావున అది ధృవీకరించమని ఆదోని తాలుకాధికారితో కలిసి కలెక్టరు గారు నిజ ధృవీకరణ కొచ్చారు. రాఘవేంద్రుని బృందావనం దగ్గిరకు రాగానే దాంట్లోంచి స్వామివారు వెలువడి మన్రోను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నారు.

స్వామి ఆయనను ఆహ్వానించి స్వయంగా అద్భుతమైన ఆంగ్లంలో మాట్లాడి మఠం ఆస్థులు ధర్మ సంరక్షణకు జ్ఞాన ప్రభోధకు, దీనజనోద్ధారణకు ఉపయోగ పడుతున్నాయని, వ్యాపార దృష్టి లేదని ఇంకా ఏమన్నా వివరాలు కావాలంటే అడగమని మఠం ఆస్థిని ముట్టరాదని సెలవిచ్చారు.



**ఆ॥ మాటరాదు, నోట 'మన్రో' కు ఆపైన**

**మంత్ర అక్షతలను మన్ననలతొ**

**స్వీకరించినాడు, చేరాక బళ్ళారి**

**సాధికారముగను జాబు వ్రాసె.**

ఆ రిపోర్టు అనుమతించవలసినది గవర్నర్. కాని ప్రమోషన్‌తో మన్రో కలెక్టరు గారే గవర్నర్ అయ్యారు. తను వ్రాసిన రిపోర్టు తనే ఆమోదించవలసి వచ్చింది. ఇంక చెప్పవలసిందేముంది. అదే రాఘవేంద్రుల మహిమ. ఆ రిపోర్టు నేటికీ అనంతపురం జిల్లా కలెక్టరు కార్యాలయంలో (ఆనాటి ప్రతిని) చూడవచ్చు.

ఇంతకంటే స్వామి మహిమ వివరించనవసరంలేదు. ఇటువంటి అనుభవాలు ఎందరికో అయినవి. వ్రాస్తూ పోతే పేజీలు చాలవు. ఆయన మన కంటికి కానరారు. కాని మన ప్రార్థన విని ఆదుకుంటారు. 700 ఏళ్ళు మిమ్మల్ని రక్షిస్తుంటానని శ్రీరాఘవేంద్రులు స్వయంగా సెలవిచ్చారు.

కం॥ నమ్మిన నడిచెద నీతో
నమ్మకమే లేనివాడు నావాడౌనా?
నమ్మకమౌను ప్రధానము
నమ్మకమే శ్రేయమిచ్చు నాదరి జేర్చున్

ఇదే శ్రీరాఘవేంద్ర తీర్థుల వారి దివ్యబోధ.

ఓం శ్రీరాఘవేంద్రాయ నమః



## శ్రీ రాఘవేంద్రుల సాహితీ పోషణ

శ్రీరాఘవేంద్ర స్వాముల వారు వేదములకు వివృతిని వ్రాసిరి. శ్రీమధ్వాచార్యుల ఋగ్ భాష్యమునందలి నలుబది ఋక్కులకు "మంత్రార్థమంజరి" యను గ్రంథము రచించి, మహోపకారము జేసిరి. వారి పూర్వాశ్రమపు కుమారులైన లక్ష్మీనారాయణాచార్యులు రచించిన "ఋగర్థమంజరి" అను గ్రంథమును ప్రచురింపజేసినారు.

ఈ క్రిందపేర్కొనబడిన గ్రంథములు శ్రీరాఘవేంద్రులచే మధ్వ సిద్ధాంత వ్యాప్తికి రచించిబడినవి.

1-3 : వేదత్రయ వివృతి
4 : మంత్రార్థ మంజరి
5-9 : పంచసూక్త వివరణ
10-19 : దశోపనిషత్ ఖండార్థము
20 : గీతార్థసంగ్రహము
21 : ప్రమేయ దీపిక వ్యాఖ్య
22 : గీతా తాత్పర్యటీకా వివరణము



23 : తంత్ర దీపిక
24 : న్యాయముక్తావళి
25 : తత్త్వ మంజరి
26 : తత్వ ప్రకాశికా భావదీప
27 : పరిమళము
28-37 : దశ ప్రకరణటీకా వ్యాఖ్య
38 : రామచారిత్ర మంజరీ
39 : కృష్ణ చారిత్ర మంజరీ
40 : తాత్పర్య నిర్ణయ భావ సంగ్రహము
41 : వాదావళీ వ్యాఖ్య
42 : చంద్రికా ప్రకాశము
43 : తర్కతాండవ వ్యాఖ్య
44 : ప్రమాణ పద్ధతి వ్యాఖ్య
45 : అణుమధ్వ విజయ వ్యాఖ్య
46 : ప్రాతః సంకల్ప గద్యము
47 : భాట్ట సంగ్రహము
48 : ప్రమేయ సంగ్రహము



## మధ్వపీఠ గురు పరంపర

శ్రీ హంసనామక పరమాత్ముని సాక్షాత్పరంపరమైన శ్రీ మన్మధ్వాచార్యుల మూల మహా సంస్థానమని, విద్యా మఠమని ప్రసిద్ధమైన శ్రీరాఘవేంద్ర స్వాముల వారి మఠపు గురు పరంపరను సర్వజనులకు అవగాహనకై ఇవ్వబడినది.

1. శ్రీ హంసనామక పరమాత్ములు
2. శ్రీ చతుర్ముఖ బ్రహ్మదేవుల వారు
3. శ్రీ సలక తీర్థులు
4. శ్రీ సనందన తీర్థులు
5. శ్రీ సనత్కుమార తీర్థులు
6. శ్రీ సనాతన తీర్థులు
7. శ్రీ దూర్వాస తీర్థులు
8. శ్రీ జ్ఞాననిధి తీర్థులు
9. శ్రీ గరుడవాహన తీర్థులు

| | |
|---|---|
| 10. శ్రీ కైవల్య తీర్థులు | |
| 11. శ్రీ జ్ఞానేశ తీర్థులు | |
| 12. శ్రీ పర తీర్థులు | |
| 13. శ్రీ సత్యప్రజ్ఞ తీర్థులు | |
| 14. శ్రీ ప్రాజ్ఞ తీర్థులు | |
| 15. శ్రీ అచ్యుత ప్రేక్షాచార్యులు | |
| 16. శ్రీశ్రీశ్రీ మన్మధ్వాచార్యులు (శ్రీమధ్వాచార్యులు) | మాఘ శుక్ల 9 |
| 17. శ్రీ పద్మనాభ తీర్థులు | కార్తీక కృష్ణ 14 |
| 18. శ్రీ నరహరి తీర్థులు | పుష్య కృష్ణ 7 |
| 19. శ్రీ మాధవ తీర్థులు | బాద్రపద కృష్ణ 30 |
| 20. శ్రీ మదక్షోభ్య తీర్థులు | మార్గ కృష్ణ 5 |
| 21. శ్రీ జయ తీర్థులు(శ్రీ మట్టీకాచార్యులు) | ఆషాఢ కృష్ణ 5 |
| 22. శ్రీ విద్యాధిరాజ తీర్థులు | వైశాఖ శుక్ల 3 |
| 23. శ్రీ కవీంద్ర తీర్థులు | చైత్ర శుక్ల 9 |
| 24. శ్రీ వాగీశ తీర్థులు | చైత్ర కృష్ణ 3 |



| | |
|---|---|
| 25. శ్రీ రామచంద్ర తీర్థులు | వైశాఖ శుక్ల 10 |
| 26. శ్రీ విబుధేంద్ర తీర్థులు | మాఘ శుక్ల 30 |
| 27. శ్రీ జితామిత్ర తీర్థులు | మాఘ కృష్ణ 30 |
| 28. శ్రీ రఘునందన తీర్థులు | కార్తీక కృష్ణ 8 |
| 29. శ్రీ సురేంద్ర తీర్థులు | పుష్య శుక్ల 12 |
| 30. శ్రీ విజయీంద్ర తీర్థులు | జ్యేష్ఠ కృష్ణ 13 |
| 31. శ్రీ సుధీంద్ర తీర్థులు | ఫాల్గుణ కృష్ణ 2 |
| 32. శ్రీ రాఘవేంద్ర తీర్థులు (శ్రీ గురు సార్వభౌములు) | శ్రావణ కృష్ణ 2 |
| 33. శ్రీ యోగీంద్ర తీర్థులు | మాఘ శుక్ల 10 |
| 34. శ్రీ సూరీంద్ర తీర్థులు | జ్యేష్ఠ శుక్ల 2 |
| 35. శ్రీ సుమతీంద్ర తీర్థులు | ఆశ్వయుజ కృష్ణ 12 |
| 36. శ్రీ ఉపేంద్ర తీర్థులు | మార్గ కృష్ణ 8 |
| 37. శ్రీ వాదీంద్ర తీర్థులు | జ్యేష్ఠ శుక్ల 9 |
| 38. శ్రీ వసుధేంద్ర తీర్థులు | ఆశ్వయుజ కృష్ణ 7 |
| 39. శ్రీ వరదేంద్ర తీర్థులు | ఆషాఢ శుక్ల 6 |



| | |
|---|---|
| 40. శ్రీ ధీరేంద్ర తీర్థులు | ఫాల్గుణ శుక్ల 13 |
| 41. శ్రీ భువనేంద్ర తీర్థులు | వైశాఖ కృష్ణ 7 |
| 42. శ్రీ సుబోధేంద్ర తీర్థులు | చైత్ర కృష్ణ 3 |
| 43. శ్రీ సుజనేంద్ర తీర్థులు | కార్తీక కృష్ణ 8 |
| 44. శ్రీ సుజ్ఞానేంద్ర తీర్థులు | శ్రావణ కృష్ణ 4 |
| 45. శ్రీ సుధర్మేంద్ర తీర్థులు | పుష్య కృ. 5 |
| 46. శ్రీ సగుణేంద్ర తీర్థులు | మార్గ శు. 15 |
| 47. శ్రీ సుప్రజ్ఞేంద్ర తీర్థులు | మాఘ కృ 6 |
| 48. శ్రీ సుకృతీంద్ర తీర్థులు | ఆశ్వయుజ శు. 10 |
| 49. శ్రీ సుశీలేంద్ర తీర్థులు | ఆషాఢ శు. 3 |
| 50. శ్రీ సువ్రతీంద్ర తీర్థులు | వైశాఖ శు. 12 |
| 51. శ్రీ సుయమీంద్ర తీర్థులు | పుష్య శు. 2 |
| 52. శ్రీ సుజయీంద్ర తీర్థులు | మాఘ శు. 4 |

శ్రీ హంసనామక పరమాత్ముని పరంపరలో ప్రస్తుత పీఠాధిపతులు 1008 శ్రీసుశమీంద్ర తీర్థ శ్రీ పాదులవారు



## శ్రీ రాఘవేంద్రాష్టోత్తర శతనామావళిః

ఓం శ్రీ రాఘవేంద్రాయనమః

ఓం సకల ప్రదాత్రేనమః

ఓం క్షమాసురేంద్రాయనమః

ఓం స్వపాదబక్తపాపాద్రిభేదనదృష్టివజ్రాయ

ఓం హరిపాదపద్మనిషేవణాల్లబ్ధ సర్వసంపదే

ఓం దేవస్వభావాయ

ఓం ఇష్టప్రదాత్రే

ఓం భవ్యస్వరూపాయ

ఓం సుఖధైర్యశాలినే

ఓం దుష్టగ్రహనిగ్రహనిగ్రహకర్త్రే

ఓం దుస్తీర్ణోపప్లవసింధు సేతవే

ఓం విద్వత్పరిజ్ఞేయమహావిశేషాయ

ఓం సంతానప్రదాయ

ఓం తాపత్రయ వినాశాయ

ఓం సంతానప్రదాయ

ఓం తాపత్రపయ వినాశాయ

ఓం చక్షుః ప్రదాయకాయ

ఓం హరిచరణరోజరజో భూషితాయ

ఓం దురితకాననదావానలాయ

ఓం సర్వతంత్రస్వతంత్రాయ

ఓం శ్రీమధ్వమతవర్ధనాయ

ఓం సతతసన్నిహితాశేషదేవతాసముదాయాయ

ఓం శ్రీసుధీందవరపుత్రకాయ

ఓం వైష్ణవ సిద్ధాంత ప్రతిష్ఠాపకాయ

ఓం యతికులతిలకాయ

ఓం జ్ఞానభక్త్యాయురారోగ్యసుపుత్రాదివర్ధనాయ

ఓం ప్రతివాదిమాతంగంఠీరవాయ

ఓం సర్వ విద్యాప్రవీణాయ

ఓం దయాదాక్షిణ్యవైరాగ్యాదిశాలినే

ఓం రామపాదాంబుజాసక్తాయ

ఓం రామదాసపదాసక్తాయనమః

ఓం రామకథాసక్తాయ



ఓం దుర్వాదిధ్వాంతరవయే

ఓం వైష్ణవేందీవరేందవే

ఓం శాపానుగ్రహశక్తాయ

ఓం అగమ్యమహిమ్నే

ఓం మహాశయసే

ఓం శ్రీమధ్వమతదుగ్ధాబ్ధిచంద్రమసే

ఓం పదవాక్య ప్రమాణపారావార పారంగతాయ

ఓం యోగీంద్రగురవే

ఓం మంత్రాలయ నిలయాయ

ఓం పరమహంస పరివ్రాజకాచార్యాయ

ఓం సమగ్రటీకావ్యాఖ్యాకర్త్రే

ఓం చంద్రికా ప్రకాశకారిణే

ఓం సత్యాదిరాజాయ

ఓం భక్తవత్సలాయ

ఓం ప్రత్యక్షఫలదాయ

ఓం జ్ఞానప్రదాయకాయ

ఓం సర్వపూజ్యాయ



ఓం తర్కతాండవవ్యాఖ్యాకర్త్రే

ఓం కృష్ణోపాసకాయ

ఓం కృష్ణద్వైపాయనసుహృదే

ఓం ఆర్యానువర్తినే

ఓం నిరస్తదోషాయ

ఓం నిరవధ్యవేషాయ

ఓం ప్రత్యర్థిమూకత్వనిదానభాషాయ

ఓం యమనియమాసనప్రాణాయామ ప్రత్యాహారధ్యానధారణ

సమాధ్యష్ఠాంగయోగానుష్టాననిష్ఠాయ

ఓం సాంగామ్నాయకుశలాయ

ఓం జ్ఞానమూర్తయే

ఓం తపోమూర్తయే

ఓం జపప్రఖ్యాతాయ

ఓం దుష్టశిక్షకాయ

ఓం శిష్టరక్షకాయ

ఓం టీకాప్రత్యక్షరార్థ ప్రకాశకాయ

ఓం శైవపాషంఏడమతధ్వాంతభాస్కరాయ



ఓం రామానుజమతమర్ధకాయ

ఓం విష్ణుభక్తాగ్రేసరాయ

ఓం సదోపాసితహనుమతే

ఓం పంచభేద ప్రత్యక్షస్థాపకాయ

ఓం అద్వైతమూల నికృంతనాయ

ఓం కుష్టాదిరోగనాశకాయ

ఓం అగ్ర్యసంపత్ప్రదాత్రే

ఓం బ్రాహ్మణప్రియాయ

ఓం వాసుదేవచల ప్రతిమాయ

ఓం కోవిదేశాయ

ఓం బృందావనరూపిణే

ఓం బృందావనాంతర్గతాయ

ఓం చతురూపాశ్రయాయ

ఓం నిరీశ్వరమతనివర్తకాయ

ఓం సంప్రదాయప్రవర్తకాయ

ఓం జయరాజముఖ్యాభిప్రాయవేత్రే

ఓం భాష్యటీకాద్యవివృద్ధ గ్రంధకర్త్రే

ఓం సదాస్వస్థానక్షేమచింతకాయ
ఓం కాషాయచేల భూషితాయ
ఓం దండకమండలుమండితాయ
ఓం చక్రరూపహరినివాసాయ
ఓం అసదూర్ధ్వపుండ్రాయ
ఓం గాత్రధృతవిష్ణుదరాయ
ఓం సర్వసజ్జనవందితాయ
ఓం మాయికర్మందిమతమర్దకాయ
ఓం వాదవశ్యర్థవాదినే
ఓం సాంశజీవాయ
ఓం మాధ్యమికమతవనకుఠారాయ
ఓం ప్రతిపదంప్రత్యక్షరంభాష్యటీకార్థస్వారస్యగ్రాహిణే
ఓం అమానుషవిగ్రహాయ
ఓం కందర్పవైరిణే
ఓం వైరాగ్యనిధయే
ఓం భాట్టసంగ్రహకర్త్రే
ఓం దూరికృతారిషడ్వర్గాయ



ఓం భ్రాంతివేషవిదూరాయ
ఓం సర్వపండిత సమ్మతాయ
ఓం అనంతబృందావన నిలయాయ
ఓం స్వప్నభావార్ధవక్త్రే
ఓం యదార్ధవచనాయ
ఓం సర్వగుణ సమృద్ధాయ
ఓం అనాద్యవిచ్ఛిన్నగురుపరంపరోపదేశలబ్ధమంత్రజప్త్రే
ఓం ధృతసర్వవ్రతాయ
ఓం రాజాధిరాజయ
ఓం గురుసార్వభౌమాయ
ఓం శ్రీమూలరామార్చకాయ
శ్రీరాఘవేంద్రతీంద్రాయ నమః

ఇతి శ్రీరాఘవేంద్రగుర్వష్టోత్తరం సంపూర్ణం
శ్రీకృష్ణార్పణమస్తు

అన్ని నామముల చివరలో నమః చేర్చి పఠించవలెను.



## రచయిత వంశవృక్షము (ఉపశాఖ మాత్రమే)

**శ్రీ భైరవభట్టు 1605 A.D.**

వీరు శ్రీరాఘవేంద్ర తీర్థులు (మంత్రాలయ స్వామి) వారి సమకాలికులు.
వివరాలకు ఈ రచన చదవండి పేజి 64)

రఘుపతి భట్టు
↓
మల్లు సోమయాజి
↓
గంగాధర సోమయాజి 1690 A.D.
↓
గణేశ్వర దీక్షితులు
↓
వేంకట సోమయాజి
↓
అప్పయ్య దీక్షితులు 1760 A.D.
↓
తిమ్మయ్య దీక్షితులు
↓
కోటయ్య సోమయాజులు
↓
మృత్యుంజయ సోమయాజి 1860 A.D.

సుబ్రహ్మణ్య దీక్షితులు 1890 A.D. — యజ్ఞ నారాయణ సోమయాజి 1895 A.D.

రామకృష్ణయ్య 1920 A.D. — వాసుదేవ సోమయాజి 1906 A.D.

రామకృష్ణయ్య ↓ సుబ్రహ్మణ్య దీక్షితులు 1947 A.D. M.Tech (రచయిత)

వాసుదేవ సోమయాజి → రామచంద్రమూర్తి, రాధాకృష్ణ

సుబ్రహ్మణ్య దీక్షితులు → శివరామకృష్ణ M.Tech, కాశీ విశ్వనాథ్ M.S

రామచంద్రమూర్తి ↓ ఎ.ఎస్. దీక్షితులు

రాధాకృష్ణ ↓ వాసుదేవుడు